# అన్నమయ్య - శ్రీపాదరాయలు

## అన్నమయ్య-పురందరదాసు



డాక్టర్ కె. సర్వోత్తమన్

26

# అన్నమయ్య - శ్రీపాదరాయలు

## అన్నమయ్య - పురందరదాసు

డా॥ కె. సర్వోత్తమన్, ఎమ్. ఏ. (తెలుగు) ఎమ్. ఏ. (సంస్కృతం)
పిహెచ్.డి., విద్వాన్, రాష్ట్రభాషాప్రవీణ (హిందీ)
తెలుగు అధ్యయనశాఖ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

పారిజాత ప్రచురణలు
6-7-554, శ్రీపురం కాలని
తిరుపతి
1982

# *ANNAMAIAH — SREEPADARAYALU*
# *&*
# *ANNAMAIAH — PURANDARADASU*


By
Dr. K. Sarvothaman

*Dipavali 1982.*
*Copies : 1000.*

*Published by:*
*Sri K. VENKATA RAO*
554, Sripuram Colony
*TIRUPATI-517 501 (A.P.)*

వెల : రూ. 10/-

*Printers :* *Phone : 10*
*Sri Lakshmi Printers & Binders*
L. B. S. Road, P I L E R - 517 214
Chittoor Dt. (A. P.)



THIS BOOK IS

PUBLISHED WITH THE

FINANCIAL ASSISTANCE OF

TIRUMALA TIRUPATHI DEVASTHANAMS

UNDER THEIR SCHEME

"AID TO PUBLISH RELIGIOUS BOOKS"

# నా మాట

ఈనాడు సాహిత్యవిమర్శలో తులనాత్మక అధ్యయనానికి ఎంతో ప్రాధాన్యముంది. మరి సాన్నిహిత్య సంబంధం వున్న సజాతీయ భాషలమధ్య అయితే ఈలాంటి పరిశీలన సార్థకమవుతుంది కూడా.

ఈ చిన్న పుస్తకంలో రెండు వ్యాసాలున్నాయి.

మొదటిది **అన్నమయ్య—శ్రీపాదరాయలు**

రెండవది అన్నమయ్య—పురందరదాసు

పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమయ్య పదైదవ శతాబ్దంలో వెలసిన ఆంధ్ర వాగ్గేయకారుడు. ఆలాగే ఆ శతాబ్దంలోనే కన్నడంలో కీర్తన వాఙ్మయాన్ని పరిపుష్టం చేసిన ప్రసిద్ధులు శ్రీపాద రాయ పురందరదాసులు. వీరి రచనల్ని అన్నమయ్య సంకీర్తనలతో బేరీజు చేయడంవల్ల మతానికి సంబంధించి. రచనలకు సంబంధించి ఎన్నో రహస్యాలు తెలుసుకొనే అవకాశమేర్పడింది. ఆ ప్రయత్నంలో వెలికి వస్తున్న వ్యాసపరంపరల్లో ఇది మొదటిది.

ఈ నా ప్రయత్నాన్ని తులనాత్మక పరిశీలన చేసేవారు. అన్నమయ్య సాహిత్యాభిమానులు, హరిదాస సారస్వత ప్రచారకులు మెచ్చుకొంటారని ఆశిస్తూ

దీపావళి — కె. సర్వోత్తమన్

15-11-1982

# ప్రణతి

ఎం.ఏ. తెలుగు పాఠ్యప్రణాళికలో "అన్నమయ్య శృంగార సంకీర్తనలు" 12వ సంపుటాన్ని ఐచ్ఛిక పాఠ్యాంశంగా నిర్ణయించి నపుడు ఆ భాగాన్ని విద్యార్థులకు బోధించే అవకాశాన్ని నా కివ్వడమే గాకుండా అన్నమయ్యసాహిత్యం పట్ల నాలో పరిశోధనానురక్తిని పెంపొందించినవారు ఆచార్య జి. ఎన్.రెడ్డిగారు

ఏటేటా జరిగే అన్నమయ్య జయంతి వర్ధంతి ఉత్సవాలలో అన్నమయ్యకు సంబంధించిన ఉపన్యాసాలిప్పించడమే గాకుండా నా అభివృద్ధిని నిరంతరం కాంక్షించేవారు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు శెట్టిగారు

నా వ్యాసాలను విని ప్రోత్సహించడమే గాకుండా పుస్తక రూపంలో తీసుకొని రావలసిందిగా సలహాలిచ్చినవారు తి.తి.దే.మాజీ కార్యనిర్వహణాధికారులు శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ I.A.S. గారు, గురువర్యులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు.

నా వ్యాసాల ప్రచురణకు కొంతవఱకు ఆర్థికసహాయం అందచేసినవారు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి I A S. గారు,

నాకు వలసిన పుస్తకాల్ని సమీకరించడంలో సహకరించినవారు డా॥కె.వాణి, కుమారి పి.లీలావతి, చి॥ ఎమ్.శ్రీహరి, డా॥ ఆర్వీయస్ సుందరంగారు

అతి స్వల్పకాలంలో అందంగా ముద్రించి యిచ్చినవారు శ్రీ లక్ష్మిప్రింటర్స్ అధినేతలు శ్రీ జి.ఆర్. పురుషోత్తం M.Sc. గారు

అందరికీ వందనాలు

దీపావళి

5-11-1982

కె. సర్వోత్తమరావు

# ఉపకరించిన రచనలు


ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర (1961) యస్వీ జోగారావు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు.

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము (1975)బాలాంత్రపు రజనీకాంతరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

తాళ్లపాక అన్నమయ్య పాటలు (1976) కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, తి.తి. దేవస్థానం, తిరుపతి.

తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవ సంచిక(1978) సం॥ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, తి.తి.దేవస్థానం, తిరుపతి.

తాళ్లపాక కవుల పదకవితలు భాషాప్రయోగవిశేషాలు (1976) డా॥ వేటూరి ఆనందమూర్తి, రీడరు, నిజాం కాలేజి, హైదరాబాదు.

తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు డా॥ వేటూరి ఆనందమూర్తి, రీడరు, నిజాం కాలేజి, హైదరాబాదు.

తాళ్లపాక కవుల సాహిత్యసేవ (1979) డా॥ ఎ. విద్యావతి, ఈడేపల్లి, మచిలీపట్టణము.

తెలుగు జానపద గేయసాహిత్యము (1978) డా॥ బిరుదురాజు రామరాజు, జానపద విజ్ఞానప్రచురణలు, హైదరాబాదు.

రాళ్ళపల్లి పీఠికలు (1978)సం॥ డా॥ఆర్వీయస్ సుందరం, రాళ్ళపల్లి అభినందన సమితి, మైసూరు.

వాగ్గేయకారులు — పదకృతి సాహిత్యం (1975)డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, హైదరాబాదు

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య చరిత్రము (1981)శ్రీ పెనుమాదు వెంకటశేషయ్య, రాజంపేట, కడపజిల్లా

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము(1978) శ్రీ తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు. పరిష్కర్త: గౌరిపెద్ది రామసుబ్బశర్మ, తి. తి. దేవస్థానం. తిరుపతి

సమగ్ర ఆంధ్రసాహిత్యం—6వ సంపుటం (1965) ఆరుద్ర యం. శేషాచలం అండ్ కో, మదరాసు

## కన్నడం

కన్నడక్కె శ్రీ పురందరదాసరు నీడిద కొడుగె (1975) జి. డి. నాడకర్ణి, కర్ణాటక విశ్వవిద్యాలయ, ధారవాడ.

కీర్తనకారరు (1975) హెచ్. యస్. వెంకటేశ్వరమూర్తి సామాన్యనిగె సాహిత్యచరిత్రె, బెంగళూరు విశ్వవిద్యాలయ, బెంగళూరు.

హరిదాస సాహిత్యసమీక్ష (1980) డా॥ జి. వరదరాజరావ్

కన్నడ అధ్యయన సంస్థె, మైసూరు విశ్వవిద్యానిలయ, మైసూరు

శ్రీపాదరాజర కృతిగళు (1973) సం॥ డా॥ జి వరదరాజ రావ్, కన్నడ అధ్యయనసంస్థె, మైసూరువిశ్వవిద్యానిలయ, మైసూర్

పురందరదాసరపదగళు (1977) సం॥ కలమదాని గురు రాయరు—కరడి బుక్ డిపో-హుబ్బళ్లి.

## ఆంగ్లం

Furandara and The Haridasa movement (1936) M. V. Krishna Rao, Karnatak University, Dharwar

Special Programmes on Annamacharya (Broucher) 1981-All indiad Radio, Vijayawada

The great Composers Book I & II
Prof. P. Sambamurthy-The Music Publishing House, Madras.

## హిందీ

అన్నమయ్యా ఔర్ సూరదాస్ (1976) ముట్నూరిసంగమేశం, తి.తి. దేవస్థానం-- తిరుపతి

## తమిళం

అన్నమయ్యా ఓర్ అరిముగం (1981)పి. శౌరిరాజన్ అండ్ కె. సర్వోత్తమన్, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

# అన్నమయ్య—శ్రీపాదరాయలు

కన్నడ హరిదాసవాఙ్మయంలో శ్రీపాదరాయలవారికి విశిష్ట స్థానం వుంది. శ్రీపాదరాయలవారికి ముందు నరహరితీర్థులనే వారు కన్నడంలో కీర్తనలు వ్రాశారు. అయితే వాటిలో రెండు మూడు మాత్రమే దొరుకుతున్నాయి. ఈ కీర్తన వాఙ్మయాన్ని పరిపుష్టం చేసిన ఘనత శ్రీపాదరాయల వారికే దక్కుతుంది. అందువల్లనే వీరి జీవిత కాలాన్ని "దా స సా హి త్య అరుణోదయకాలంగా" కన్నడిగులు పేర్కొంటారు.

తెలుగు పదకవితావాఙ్మయంలో అన్నమాచార్యులకే అగ్రతాంబూలం. అన్నమయ్యకు ముందు కృష్ణమాచార్యులు వచన సంకీర్తనలు వెలువరించినా అతని చాతుర్లక్ష సంకీర్తనలు పూర్తిగా వ్యవహారంనుండి మరుగుపడ్డాయి. ఈ నిబంధకవితా పద్ధతిని దీప్తివంతం చేసిన కీర్తి అన్నమయ్యదే. అందువల్లనే అన్నమయ్యను "పదకవితా పితామహుని"గా ఆంధ్రులు పట్టంగట్టారు.

శ్రీపాదరాయల జీవిత విశేషాలు తెలుసుకోవడానికి వారి శిష్యులయిన వ్యాసరాయల సంకీర్తనలు పంచరత్నమాలాస్తుతులు, విజయదాసాదులు సుళాదులు, శ్రీనిధితీర్థులవారి శ్రీపాదరాజాష్టకం, భీమాచార్యులు వ్రాసిన "శ్రీపూర్ణబోధ గురువంశ కల్పతరు" మొదలయినవి ఆధారాలు.

అన్నమయ్య జీవిత విశేషాలు తెలుసుకోవడానికి పెదతిరుమలాచార్య చినతిరుమలాచార్యుల సంకీర్తనలే గాకుండా తాళ్లపాక చిన్నన్న అన్నమాచార్య చరిత్రము మొదలయినవి తోడ్పడుతాయి.

పై ఆధారాలతో శ్రీపాదరాయలు అన్నమాచార్యుల జీవితాల లోని సామ్యవైషమ్యాలను, రచనల్లో కనిపించే సాదృశ్య విభేదాలను క్రమంగా చూద్దాం.

శ్రీపాదరాయలు క్రీ. శ. 1404 నుండి క్రీ. శ. 1502 దాకా జీవించినవారు. తాళ్ళపాక అన్నమయ్య క్రీ. శ. 1408లో జన్మించి 1503 దాకా జీవించినవారు. దీనిబట్టి ఈ మహాపురుషుల సమకాలికత్వం స్పష్టమవుతుంది.

సంగ్రహంగా చెప్పాలంటే శ్రీపాదరాయలు కర్ణాటక రాష్ట్రంలోని చన్నపట్టణం దగ్గర్లోని అబ్బూరిలో పుట్టి, బాల్యం అక్కడే గడిపి, శ్రీరంగక్షేత్రంలో స్వర్ణవర్ణతీర్థులవారి ఆదేశం మేరకు సన్యాసం స్వీకరించి, కొంతకాలం తరువాత "ములుబాగిలు"చేరి అక్కడే చాల కాలం జీవించి 98వ ఏట బృందావనస్థులయ్యారు. అన్నమయ్య ఆంధ్రప్రదేశ్‌లోని కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో పుట్టి పదారవయేట శ్రీవెంకటేశ్వర సాక్షాత్కారం పొంది తాళ్లపాక తిరుపతులలో జీవించిన ధన్యజీవి.

మతవిషయానికి వస్తే శ్రీపాదరాయలు మాధ్వుడు. అన్నమయ్య స్మార్తుడయినా ఘనవిష్ణువు వల్ల వైష్ణవ దీక్ష పుచ్చుకొన్నవారు. జీవితాంతం బ్రహ్మచర్యమవలంబించి ఒక మఠానికే మూలపురుషుడయిన కీర్తి శ్రీపాదరాయల వారిది. గార్హస్థ్యం స్వీకరించినా భగవత్సేవావృత్తికి సంసారాన్ని ప్రతిబంధకంగా భావించకుండా రోజులు గడిపిన భక్తుడు అన్నమయ్య. తాను సన్యాసం స్వీకరించినా

వ్యాసరాయలు మొదలగువారిని పుత్రులుగా భావించి కన్నడ కీర్తన సాహిత్యాన్ని పెంపొందించిన విశాల దృక్పథం శ్రీపాదరాయలవారిది. తనతో అంతంగాకుండా తన సంతతి వారిని వాగ్గేయకారులుగా తీర్చిన భాగ్యశాలి అన్నమయ్య.

శ్రీపాదరాయలు, అన్నమయ్యల జీవితఘట్టాలలో పరిశీలించ దగ్గ ఒక సామ్యం వుంది. అదే సాళువ నరసింహరాయల సహ వాసం.

సాళువ నరసింహరాయలు "టంగుటూరు" పాలించే రోజుల్లో అన్నమయ్య పేరుప్రతిష్ఠలు విన్నాడు. అన్నమయ్య ఆశీస్సులు తన పురోభివృద్ధికి దోహదం చేస్తుందని భావించాడు. "శ్రీకృష్ణుమన్నన గ్రిడి భూచక్ర మేకచక్రంబుగా నేలిన పగిది" పరిపాలిస్తానని కాళ్ల పడ్డాడు.అన్నమయ్య అనుగ్రహం సంపాదించాడు.తపశ్శక్తి సంపన్ను డయిన అన్నమయ్య ఆశీస్సులతో చివరకు పెనుగొండ ప్రభువయ్యా డుకూడా.తనకు సిద్ధించిన అభ్యుదయ సూచకంగా అన్నమయ్యకు కనకాంబరాలిచ్చి సత్కరించడమే గాకుండా గ్రామాదులు దానం చేశాడు. చివరకు తన మీద శృంగారపదం పాడవలసిందిగా కోరి గర్వభంగం పొంది అన్నమయ్య ఆశ్రయం పోగొట్టుకొన్నాడు.

సాళ్వ నరసింహరాయలు పెనుగొండ పరిపాలించే రోజుల్లో అతడు విజయనగర చక్రవర్తుల సామంతుడు. అతని ఏలుబడిలో ములుబాగిలు, కడప, అనంతపురం, చిత్తూరు మండలాలు వుండేవి. తిరుపతి అతని సామ్రాజ్యంలోని భాగమే.అయితే తిరుపతి అర్చకులు

నరసింహరాయల్ని లెక్కపెట్టేవారుకారు. నరసింహరాయలు అర్చకుల్ని సరిదిద్దటానికి సామదానభేదోపాయాలు ప్రయోగించాడు. చివరికి విసిగి వారిని కత్తికెర చేశాడు. అపుడు నరసింహరాయలకు బ్రహ్మహత్యాదోషమంటుకుంది. తిరుమలేశునికి పూజాదులు లేక దేవాలయ పూజావిధానం కుంటుపడింది. అప్పుడే ముళుబాగిలు మఠాధిపతులయిన శ్రీపాదరాయలవారి కీర్తి ప్రతిష్ఠలు విన్నాడు. తపశ్శక్తిసంపన్నులయిన వారి పాదాల పడ్డాడు. వారు మంత్రోపాసన ద్వారా రాయల బ్రహ్మహత్యాదోషం నివారించడమేగాకుండా వరాలిచ్చారు. ఆ వరాల కారణం వల్లను,దైవానుగ్రహం వల్లను రాయలు విజయనగర సింహాసనమెక్కాడు తనకు గలిగిన అభ్యుదయ సూచకంగా శ్రీపాదరాయల్ని ఘనంగా గౌరవించాడు. ఈ వృత్తాంతాన్ని శ్రీపాదరాయల శిష్యులయిన వ్యాసరాయలు "మహిమ సాలదె" అనే కీర్తనలో స్పష్టం చేశారు.శ్రీనిధితీర్థులనే మరొక శిష్యులు ఈ వృత్తాంతాన్ని ఈ విధంగా వర్ణించారు.

> "నమ్యద్వీర నృసింహనామ నృపతేర్భూ దేవహత్యావ్యథాం
> దూరీకృత్య తదర్పితోజ్వల మహః సింహాసనే సంస్థితః
> సేవ్యే పూర్వకవాట నామకపురే సర్వేష్ట సిద్ధిప్రదః
> సః శ్రీపాదయతీశ్వరః ప్రతిదినం భూయాద్భహుశ్రేయసే"

సాళ్వ నరసింహరాయలు తన జీవితకాలంలో అన్నమయ్యను, ఆపై శ్రీపాదరాయలను ఆశ్రయించి విభిన్న పరిస్థితులలో అనుగ్రహం పొందడం చాలా చిత్రమయిన విషయం. కాకపోతే అన్నమయ్య పట్ల అహంకారం జూపిన రాయలు బుద్ధితెచ్చుకొని శ్రీపాదరాయల

వారిని మొదటినుండి చివరిదాకా గౌరవించడం చెప్పుకోదగ్గ పరిణామం.

అన్నమయ్య శ్రీపాదరాయలు సమకాలికులయినా వీరిద్దరికి ఏకరాజాశ్రయత్వం లభించినా ఒకరినొకరు కలుసుకొన్నారో లేదో తెలియదు. అన్నమయ్య పురందరదాసుల సమాగమాన్ని విస్తరించి చెప్పిన చిన్నన్న ఈ వృత్తాంతం చెప్పలేదు. బహుశః చిన్నన్న అన్నమాచార్యుల జీవితం వ్రాసేనాటికి అన్నమయ్య పండు ముదుసలి కావడమో, ప్రధానమయిన ఘట్టాల్ని వర్ణిస్తే చాలని అనుకోవడమో వీటికి కారణం కావచ్చు. అయినా వీరు పరస్పరం ఎరిగివున్నారనడానికి కీర్తనలు సాక్ష్యం పలుకుతున్నాయి

అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరు సంకీర్తనల రచన చేపట్టడానికి ప్రధానంగా మూడు ప్రేరేపక శక్తులు కనిపిస్తాయి. మొదటిది శివశరణుల వచన ప్రభావం. రెండవది విష్ణ్వాలయాలలో నాలాయిర దివ్యప్రబంధపఠనం. మూడవది స్వభాషలో కీర్తనలు వ్రాయాలనే సంకల్పం. ఇవేగాకుండా వీరి రచనలపై జయదేవుని గీతగోవింద ప్రభావం కూడా వుంది.

ఇంక వీరి రచనల్లోని సామ్యాలు చూద్దాం.

శ్రీపాదరాయలు మెచ్చిన దేవుడు శ్రీరంగనాథుడు. అతని కీర్తనల్లో ఎక్కువ రంగనివే వున్నాయి. ఇతర దేవతామూర్తుల్లో నరసింహ శ్రీనివాసులు ప్రధానులు. అన్నమయ్య కొలిచిన దేవుడు తిరువేంకటనాథుడు. అతని కీర్తనలంతటా స్వామే కనబడతాడు. ఇతర దేవతల్లో

నరసింహ, విఠలులు ముఖ్యులు. ఇద్దరు విస్తృతంగా దేశసంచారం చేసినవారే.

శ్రీపాదరాయలు "రక్షమాం రంగేశ" (పుట. 221) సంకీర్తనలో స్వామిని "దక్షిణాధీశ" (పుట. 221) అని సంబోధించారు. ఇది పూర్తిగా కావేరి రంగనికి సంబంధించింది. అన్నమయ్యకూడా

"బ్రహ్మపూజించె రఘుపతి విభీషణుని కిచ్చె
బ్రహ్మణ్యుఁడీ రంగపతిఁగొలువరో
కావేరీ మధ్య రంగక్షేత్ర మల్లదివో
శ్రీవిమాన మదివో శేషపర్యంకమిదే (2-131)

అని భక్తితో కావేరి రంగని సేవించారు. అన్నమయ్య పాడిన శ్రీరంగ కీర్తనలు మరెన్నో వున్నాయికూడా (3-24, 474, 545, 11-2-1)

ఇదే మోస్తరు శ్రీపాదరాయలు నమస్కరించిన దైవం నరసింహుడు. సామాన్యమైన బాలుని కోసం సాక్షాన్నారాయణుడు నరసింహావతారమెత్తడం వల్ల ఈస్వామి భక్తులకు ఆరాధ్యుడైనాడు. అంతేగాకుండా శ్రీపాదరాయులు ముళుబాగిలులో వాసం చేసినవారు. అదొక పవిత్రక్షేత్రం. అక్కడ శ్రీఅక్షోభ్య తీర్థులవారు బొగ్గుతో "యోగనరసింహ" చిత్రం గీసి శ్రీవిద్యారణ్యులవారితో వాదం చేసి ద్వైత మత స్థాపన చేశారు. శ్రీపాదరాయల వారక్కడే వుండి ఎన్నో నరసింహకీర్తనలు పాడారు. ఇవేగాకుండా శ్రీలక్ష్మీనృసింహ ప్రాదుర్భావదండకమనే విశిష్టకృతిని సంతరించారు. మరి బంకాపురంలోని దేవుణ్ణి

"బంకాపురద ధారుణిపురవాస–వీరనరసింహదేవకృష్ణ"

అని పాడారు.

అన్నమయ్య అహోబలంలో ఆదివన్‌శఠగోపయతి దగ్గర వేదాంతం చదువుకొన్నవారు. అన్నమయ్య విస్తారంగా సంచరించిన వాడు కావడంవల్ల వివిధ ప్రదేశాలలో వున్న నరసింహుల్ని స్తుతించారు. వాటిలో అహోబల నరసింహస్వామి, ఒగునూతుల నృసింహస్వామి, కదిరి లక్ష్మీనృసింహస్వామి, బొమ్మిరెడ్డిచెర్ల ప్రహ్లాదనారసింహమూర్తి, మండెము నృసింహస్వామి, వేదాద్రియోగానంద లక్ష్మీనరసింహరూపాలు చెప్పుకోదగ్గవి. ఇవేగాకుండ శ్రీపాదరాయలలాగే నరసింహుని గూర్చి సువిస్తరమైన కీర్తనకూడా వ్రాశారు అన్నమాచార్యులు.

అన్నమయ్య రంగని కొలిచినట్టే శ్రీపాదరాయలు "తిరుమలేశుని" మొక్కుకున్నారు. దాససాహిత్యంలో తిరుమలేశునిగూర్చి పాడిన వారిలో శ్రీపాదరయలే ఆద్యులు.

ಭೂಷಣಕೆ ಭೂಷಣ ಇದು ಭೂಷಣ
ಶೇಷಗಿರಿವಾಸ ಶ್ರೀವರದ ವೆಂಕಟೇಶ (పు. 101) అనేకీర్తన

"ಸ್ಮರಿಸಿದವರನು ಕಾಯ್ವನಮ್ಮ
ಸೂರ್ಯಾನೇಕ ಪ್ರಭಾವ
ಸುರಮುನಿಗಳ ಸಂಜೀವ" (పు 166) అనే కీర్తన ప్రసిద్ధాలు.

ఇవేగాకుండా

"ಹರೇ ವೇಂಕಟಶೈಲವಲ್ಲಭ
ಪೊರೆಯ ಬೇಕು ಎನ್ನ" (పు. 166) అనేది

"సాగి బారయ్యా నీ
బాగి నమసువే
యోగిగళరసనే శ్రీనివాస" (పు 245) అనేవి
శ్రీనివాసునికి సంబంధించినవే.

అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరున్ను రాచరికాన్ని ఏవగించుకొన్న వారే. అన్నమయ్య కొంతకాలం రాజాశ్రయంలో వుండి రోసిన వారు. శ్రీపాదరాయలు సన్యాసిగావుంటూ లోకప్రవర్తనను నిందిస్తూ రాచరికాన్ని అసహ్యించుకొన్నవారు. నరస్తుతి వైముఖ్యం ఇద్దరిలోను సమానంగా కనిపిస్తుంది.

"మానుగ శ్రీపతికి మొక్కిన చేతులు
అనరుహులకు దండమా" 9-167

"ఎలమితోఁదిరువేంకటేశుఁగొలువలేక
పొలము రాజులవెంటఁబొయ్యేవుగా" 11-3-138.

"పొంచినీదాసుడనై యల్పుల వేడఁబోనేల
సరవితో వేదములు చదివేటి నోరను
పరుల మీది పదాలు పాడేదా
పరుల ఇంటికేగి పరుల పరుల వేడఁజేసినట్టి
ఎరుక మాలినట్టి చేఁత లేల నిన్ను విడుచును" 9-167
అనేవి అన్నమయ్య నిందావాక్యాలు.

"పరరబాగిలు కాయిదు హోయితీ సంసార
పరర గుణగళ తుతిసి హోయితీ నాలగె" (పుట. 4)

(ఇతరుల వాకిళ్లలో కాచికాచి సంసారం గడిచింది. ఇతరుల గుణాల్ని పొగడి పొగడి నాలుక బండబారింది) అని అన్నారు. అంతే గాకుండా

అగ బేకు రాజ్య భోగగళెనగెందు
ఈగ నాను బేడ బందుదిల్ల (పుట. 13)

(నాకు రాజ్య భోగాలు సిద్ధించాలనే నెపంతో నేను రాలేదు సుమా) అని తన మనోగతాభిప్రాయాన్ని స్పష్టం చేశారు.

అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరు వైష్ణవులే. కాకపోతే అన్నమయ్యది రామానుజ మతం, శ్రీపాదరాయలవారిది మాధ్వమతం. అన్నమయ్య వేదాంతంలో కొన్నిచోట్ల అద్వైతపు జిడ్డు కనిపిస్తుంది. రాయలవారి కీర్తనల్లో ద్వైతమతం గుబాళింపు వుంది. తమతమ గురువుల్ని కీర్తించడంలోగాని ఆయా మత సిద్ధాంతాలను ప్రతిపాదించడంలో శాస్త్రవైదుష్యాన్ని, యుక్తివాదాన్ని వీరిద్దరు చేపట్టారనడం నిజం. అలాగే గురువుల స్తుతిచేయడంలో ఒకరినొకరు పోటీపడినట్లు కీర్తనలెన్నో సాక్ష్యమిస్తున్నాయి.

శ్రీపాదరాయలు "సుమ్మనె వైష్ణవ నెంబిరి" (పుట. 163) అనే కీర్తనలో వైష్ణవుల కవసరమయిన బాహ్యవేషాన్ని చెపుతూ అవసరమయిన ఇతర లక్షణాల్ని కూడా జత చేశారు. వాటిలో నామధారణతో

శాస్త్రపరిజ్ఞానం, సింగారాలతోబాటు భక్తి భావన, స్వేచ్ఛాసంభాషణ లతో శ్రీకృష్ణపరమాత్మని శరణు పొందడం మొదలయినవి చెప్పారు. అన్నమయ్య ఒకసారి వీరవైష్ణవానికి ప్రాధాన్యం కల్పిస్తూ వేషం గురించి ఈలా చెప్పారు.

ఇట్టి పంచసంస్కారాలెచ్చోట నుండినాను
పట్టిన వారే మాకుఁ బ్రమాణము
మట్టుగ నీరూపనామము లెందునుండినాను
కట్టఁగడ వారైన ఘనపుణ్యులు
పలుక వైష్ణవ వేషభాష లెందు నుండినాను
వలనుగ మాకు సహవాస యోగ్యులే 9–201

ఏడ నిందలిక నేడ సంస్తుతులు
జాడల శ్రీవైష్ణవులకు 9–200

ఘనవైష్ణవ వేషభాషలెందు నుండినాను
వలనుగ మాకు సహవాస యోగ్యులే
నడువరో జడియక నవ్యమార్గమిది
మడుఁగిది వైష్ణవ మార్గమిది 11-1-139

ఎదురు లేక చరింతు రెట్లైనా శ్రీవైష్ణవులు
మదించి యేనుగులకు మట్టిమేరవున్నదా

అనే కీర్తనలో భాగీరథిలో పాపం, వేదాలలో అబద్ధాలు, అమృతంలో చేదు, ఆకాశంలో నెరసులు, సూర్యునిలో చీకటి, కామధేనువులకు అడిగిన దివ్వనిస్థితి వుందా అని ప్రశ్నించారు.

అన్నమయ్య శ్రీపాదరాయుల మతప్రచారానికి భారత భాగవత రామాయణ హరివంశాదులు మూలస్తంభాలు. ఈ దృష్టితోనే వీరిద్దరు ఆయా గ్రంథాల నుండి లెక్కలేనన్ని వుపాఖ్యానాలను తీసుకొన్నారు.

"ధ్రువ విభీషణాదులు సాక్షి
వివరపు జీవులు వెదకేదిది" (9-3) అని

అన్నమయ్య అంటే "తుంగ గుణ ధ్రువ విభీషణ హనుమాదిగళు మంగళాత్మక హరియెనంతు భజిసి భంగవిల్లదె హొరెదరై (ఉన్న తోన్నత గుణగణులయిన ధ్రువవిభీషణ హనుమంతాదులు హరి యొకడే మంగళాత్ముకుడని సేవించి ఏలాంటి ఇబ్బందులు లేక గట్టెక్కారు కదా)అని స్తుతించారు.

ఇరవుగా నెరగరా యెల్లదేవతలలో
పొరికృష్ణుడు అగ్రపూజగొన్నది (9–62) అని అంటే

"రాజసూయవ ధర్మసుతమాడె అవనగ్ర
పూజెగరుహరు సురరొళొరెందెనలు
భొజనను సద్గుణను కృష్ణనొబ్బనె యెందు
రాజసభెయందేవరీలి నుడిదను"

(ధర్మసుతుడయిన ధర్మరాజు రాజసూయ యాగం చేయసంకల్పించినపుడు దేవతల్లో పూజార్హులెవరని ప్రశ్నించినపుడు సద్గుణాలు గలవాడు కృష్ణుడని రాజసభలో భీష్ముడు వక్కాణించాడు).

శిరసు తుంచి తుంచి చిచ్చులోన వేలిచి
వరములు వడసె రావణుఁడెన్నైనా

నిరతి రాముని చేత నిమిషములోననె
వరములన్నియు నెందో వరతి పాలాయె

అని రావణుని తపసు, దానివల్ల పొందిన వరాలు నిష్ఫలమయ్యా యని అన్నమయ్య చెప్పగా శ్రీపాదరాయలు

"రావణాసుర కుంభకర్ణ నరకాదిగళు
శైవకృపవను మాడివరవపడెయ
అవరగళను విష్ణునరరూపి నెందరిదు
దేవర్కళను కాయిద కథెయ నీనరియ"

అని రావణాసుర కుంభకర్ణాది రాక్షసులు శైవకృపను పొంది వరాలు పొందినా వారిని సామాన్య నరులుగా భావించి దేవతలను విష్ణువు రక్షించాడని అన్నారు. అన్నమయ్య కాకాసుర వృత్తాంతాన్ని

"కాకాసురు దోషము కడకుఁబరిహరించి
చేకొంటివి శరణంటె చేరి మగుడ
యీ కడ మానేరములు యింతకంటె నెక్కుడా
నీకే నే శరణము నీవు మమ్ముఁగాతువు" (8-128)
అన్నారు.

ఈ వృత్తాంతాన్ని

హక్కియ మేలుళ్ల దయ నమ్మమ్యాలె
ఇక్కదేకె హెూద్యో విధియె

సామాన్యమైన పక్షిపై నీవుంచిన దయ నాపై ఎందుకు చూపలేదయ్యా అని శ్రీపాదరాయలు ఆక్రోశరూపంలో వ్యక్తం చేశారు.

ఈలాగే బాణాసుర, ఘంటాకర్ణ, కార్తవీర్యార్జునుల వారి వృత్తాంతాలు ఇరువురి రచనలలో కనిపిస్తాయి.

విశిష్టాద్వైతులకు శ్రీమన్నారాయణుడు పురుషోత్తముడు. అనంత కల్యాణగుణోపేతుడు. ఇతరదైవాలు నారాయణునికి సాటిరావు. ద్వైతులకు శ్రీమన్నారాయణుడు సర్వోత్తముడు ఈ నిరూపణ కోసం అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరు పురాణాలలోని కథల్ని తీసుకొన్నారు. వీటిలో భృగుమహర్షి వృత్తాంతం, శివుడు మోహినీ అవతారం చూచి దిగజారిపోవడమనేవి ప్రధానమైనవి.

అన్నమయ్య పదాలలో భృగుమహర్షి వృత్తాంతం కనిపించదు. వేంకటేశ్వరుణ్ణి తన దైవంగా భావించిన అన్నమాచార్యులు ఈవృత్తాంతాన్ని తప్పక విశదీకరించి వుంటారు. అయితే బహుశః అది నష్టమై ఉండవచ్చు. శ్రీపాదరాయలవారు ఈ వృత్తాంతాన్ని రమణీయంగా "బిడిబిడి సందేహవను పొడమి మనుజరెల్ల" (వదలండి సందేహాన్ని పుడమిలోని మనుజులందరు) అనే కీర్తనలలో తీర్చిదిద్దారు.

శివుడు విష్ణువు మనుమడని ఒక కథ. మహాభారత తాత్పర్య నిర్ణయంలోని ఈ కథ అనుసరించి శ్రీపాదరాయలవారు "రమ యరసవె ఇవ మొమ్మగనమ్మ (పుట. 155) (లక్ష్మీదేవి మగని మనుమడమ్మ)అనే కీర్తన వ్రాశారు.

మనుమడైన శివుడు ఒకసారి తాతదగ్గరికి వచ్చి మోహినీరూపం చూపమని కోరాడు. కాని విష్ణువు ఒప్పుకోలేదు. శివుడు తాతను బలవంతపెట్టాడు. చివరకు విష్ణువు మోహినీరూపం దాల్చినాడు.

ఈశ్వరుడు మోహపరవశత్వంతో మోహినిని పట్టుకోవడానికి వెళ్లాడు. చివరకు స్వస్వరూపంతో స్వామి ప్రత్యక్షమయ్యాడు. అయితే విష్ణ్వాధిక్యాన్ని విశదీకరిస్తూ అన్నమయ్య-

ఒడ్డున కైలాసమేలే వుమాపతిఁగడుపులో
వెడ్డువెట్టి పెంచేవాడు

అనడంలో మహాభారత తాత్పర్య నిర్ణయ కథ ద్యోతకమవుతుంది.విశేషించి పార్వతి విష్ణువును గొనియాడడాన్ని అన్నమయ్య చాల చోట్ల చెప్పారు.

"కాత్యాయనీ స్తోత్రకామ"
"శాంకరీస్తోత్రములు సతతమును గైకొనెడి" 1–37

"కాత్యాయనీనుత కలిత నామునకు" 1–46

ఘన నీ నామమె గౌరి నాలికపై
పనిగొన్నమంత్ర పాఠము 11–1-124

"ఆదర బార్వతి దేవి కాతడే నీ మంత్రమిచ్చె" 9-20

అన్నమయ్య శ్రీపాదరాయల కృతులలో కలికాలానికి సంబంధించిన పదాలెన్నో కనిపిస్తాయి. "తతిగాని యీపాటు దైవమా విచారించవే కతలాయ జెప్ప నేడు కలికాలమహిమ"అనే కీర్తనలో తురుష్కుల దండయాత్ర వల్ల ఆగడు పడిన భూసురులు, కామినుల మానభంగాలు, గోహత్య, పరజాతీయుల దేవాలయ ప్రవేశం, నిరపరాధులుపొందే ఇబ్బందులు, ధర్మలోపము మొదలగువాటి

బాధతో వర్ణించారు. అన్నిటికి మించి చివరకు

నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుగుదువు
కలుషమ ఘనమాయఁ గలికాలమహిమ అని చెప్పడంలో

అన్నమయ్య పరమాత్మ సమర్పణ వ్యక్తమవుతుంది.

కలలోని సుఖమే కలియుగమా 11–3–52 అనే కీర్తనలో కలికాలమెంత నికృష్టమో ప్రదర్శించారు అన్నమయ్య.

కలలోని సుఖమే కలియుగమా ఎన్న
కలలో నెక్కడిదె కలియుగమా

కడిగడి గండమై కాలము గడిపేవు
కడుగఁగడుగ రొంపి కలియుగమా
బడలికె వాపపు పరమేదొ చూపవు
గడిచీటియును నీవు కలియుగమా

కరపేవు కళతలే మఱపేవు మమతలే
కరకఱ విడువవు కలియుగమా
తెరచీర మఱఁగితే తెరువేల మూసేవు
గురుసేల దాటేవో గలియుగమా
కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు
కానీలే కానీలే కలియుగమా
పైనిదే వేంకటపతి దానులుండఁగ
కానవా నీవిదేమి కలియుగమా

అయితే శ్రీపాదరాయలు కలికాలాన్ని నిందించలేదు.

కలికాలకె సమయుగ విల్లవయ్యా
కలుష హరిసి కైవల్య వీవుదయ్యా
సరెనామ కీర్తనె స్మరణెసాకయ్యా
స్మరిసలు సాయుజ్య పదవీవుదయ్యా
బలవంత శ్రీరంగ విఠలన నెనెదరె
కలియుగవ కృతయుగ వాగువుదయ్యా. (పుట. 186)

కలికాలానికి సమానమయిన మరొక యుగంలేదు. కాలుష్యం పరిహరించి కైవల్యం ప్రసాదించేది. నామసంకీర్తన మొక్కటిచాలు.స్మరించడం వల్లనే సాయుజ్యం ప్రసాదించేది.శ్రీరంగ విఠలుణ్ణి తలిస్తేచాలు కలియుగం కృతయుగమవుతుంది"అని శ్రీపాదరాయలు నిర్ణయం.

భగవంతుడు గొప్పవాడా లేదా అతని భక్తులు గొప్పవారా అనేది కుతూహలమయిన ప్రశ్న. రామబాణం కంటె రామనామం గొప్పది. భగవదపచారం కంటె భాగవదపచారం చాలా చెడ్డది. అన్నమయ్య హనుమంతుణ్ణి కీర్తిస్తూ భక్తులే గొప్పవారన్నారు.

ఇతఁడే యతఁడు గాఁబోలేలిక బంటును నైరి
మితిలేని రాఘవుఁడు మేటి హనుమంతుఁడు
జలధి బంధించిఁదాటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరక దాఁటె హనుమంతుఁడు
అలుకతో రావణుని యదటనణఁచె నతఁడు
తలచి మైరావణుని దండించె నితఁడు

కొండవెల్లగించెఁదొల్లి గోవర్ధనుఁడతఁడు
కొండతో సంజీవి యెత్తె గోరి యీతఁడు
గుండు గరఁచె నహల్య కొరకు సీతాపతి
గుండు గరఁగఁగఁబాడె కోరి యీతఁడు. 11-1-148

శ్రీపాదరాయలు అన్నమయ్యలాగే దేవుణ్ణి వుద్దేశించి

నీనే బల్లిదనో రంగా
నిన్న దాసరు బల్లిదరో (పు. 84)

అని ప్రశ్నించాడు. అంటే నీవే సమర్థుడవో లేక నీదాసులే సమర్థులో అని ప్రశ్న. పరమ పురుషుడవని శ్రుతులు ఘోషిస్తుంటే సామాన్య నరుడయిన ధర్మరాజు కొలువులో పూజలందుకొన్నావు. పురుహూతా దులయిన దేవతలు నీ సేవకు పడిగాపులు కాస్తుంటే నీవు భూత లంలో సంప్రీతితో పార్ధునికి రథం నడిపావు. బ్రహ్మాండాదులకు అధి పతివని భావిస్తుంటే నీవు బలివాకిట నిలిచావు. ఆయుధం చేపట్టనని ప్రతిజ్ఞ పట్టిన నీవు యుద్ధరంగంలో భీష్ముడు కౌరవసైనాన్ని చిందర వందర చేస్తుంటే చక్రం పట్టావు. పసివాడు పిలవగా కంబం చీల్చుకొని నరమృగ వేషంతో వచ్చి భక్తుల్ని కాపాడావు అని అనేక రకాలుగ దృష్టాంతాలు చూపించి శ్రీపాదరాయలవారు—

"నానా తెరది నిదాసిని నోడలు
నీనే భక్తరాధీన" (పుట. 84)

అన్నివిధాల పరిశీలించి చూడగా నీవే భక్తులకు అధీనుడవని స్పష్ట మయిందన్నారు.

ఇదే మోస్తరు వాత్సల్య భక్తి ప్రదర్శనలో కూడ వీరిరువురికి పోలికలు కనిపిస్తాయి.

గోపికలు ఎన్నో నిందలు మోపి కృష్ణుణ్ణి ఆడిపోసుకుంటూ యశోదదగ్గరికి వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులు వినలేక పోయింది యశోద.చివరకు అసలు సంగతి ఏమిటో కనుక్కోవాలను కొంది. అంచేత పిల్లవాణ్ణి నిలదీసి అడిగింది; అపుడు కన్నయ్య ఈలాచెప్పాడు.

"అమ్మా, ఈ గొల్లెతలమాటలు వినవద్దు. నామీద లేనిపోనివి కల్పించి కొండేలు చెప్పి దొంగని అంటున్నారు. నీచేత చావగొట్టించా లని వారి కోరిక.

పెద్ద బానల్లోని పాలు తాగడానికి నాపొట్ట ఏమయినా చెరువా? నీవే చెప్పమ్మా. కావాలంటే అన్నయ్యను పిలిచి అడుగు. తప్పు నాదయితే రోలుకు కట్టేయ్.

ఇష్టం వచ్చినట్టు వెన్న మెక్కేయడం నాకు మంచిదా! ఒక వేళ వాటి కాశపడితే దేవుడు నాకళ్లు పొడిచేయడూ!

అటకలమీద కెక్కడం పిల్లవానికి చేతవుతుందా!చెప్పమ్మా, నీవు నాకు పాత్రల్లో పోసి తినమని యిచ్చినదాన్నే సగం తిని నీవు తిడతావని గుడ్డల్లో దాచేసి వెళిపోతున్నా.

ఆడపిల్లల్ని ఏడిపించడానికి నేనేమయినా పెద్దమగాణ్ణా? చెప్పమ్మా. అడ్డం వచ్చినవాళ్లు ఏవేవో కూస్తారు. నేను నీ బిడ్డను కాదటమ్మ"అని ఏడుస్తుంటే యశోద ఉంగరాల వేళ్లను చాచి బిడ్డను

తనకేసి లాక్కొని ఉడుపి కృష్ణుని వుయ్యాలలో పడుకోబెట్టి వూపిం దట. కన్నడ హరిదాస వాఙ్మయంలోనే ఈ భావం ప్రదర్శించే

"గొల్లతియరెల్ల కూడి ఎన్నమేలె
ఇల్లద సుద్ది పుట్టిసి
కళ్లనెందు దూరుతారె ఎన్న
కొల్లబేకెంబ బగెయు" (పు. 45) కీర్తన ప్రసిద్ధిపొందిన

రచన.

కన్నయ్య మాటలు యశోదను బాగా కదిలించివుండాలి. అంచేత మరల ఫిర్యాదు చేయడానికి వచ్చిన గోపికలతో యశోద మాట్లాడుతూ గట్టిగా చీవాట్లు పెట్టింది. ఈ భావాన్ని విస్తరించిన అన్నమయ్య కీర్తన చూడండి–

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీ వలెనె కంటి నెయ్యమైన బిడ్డని
బాయిటఁబారవేసిన పాలువెన్నెలును
చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీ యిండ్లు జతనాలు మీరు సేసికొనక
పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని

మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ
ఆసపడకుందురా ఆడే బిడ్డలు
వోసరించి మోసపోక వుండలేక మీరు
సేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని

శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది భార్యలు. అయినా వారిలో రుక్మిణీ సత్యభామలకే ప్రసిద్ధి. వీరిద్దరి సవతి మాత్సర్యం జగత్ప్రసిద్ధం. కృష్ణుని బాల్యక్రీడలకు ప్రాధాన్యమిచ్చినట్లే వీరిరువురి మాత్సర్యాన్ని కేంద్రంగా తీసుకొని శ్రీపాదరాయలు లోకోత్తర విషయాలను స్పష్టం చేశారు. ఆకీర్తన కన్నడ హరిదాస సాహిత్యంలో "రుక్మిణీ సత్యభామ సంవాదంగా" (పు. 33-66) ప్రసిద్ధి పొందివుంది.

రుక్మిణీ సత్యభామలు తగవులాడుకొంటారు. నేను శ్రీకృష్ణుని అనురాగం చూరగొన్నదాణ్ణని రుక్మిణంటే కాదు నేనని అంటుంది సత్యభామ. వివాదం ముదిరి పాకాన పడుతుంది. అపుడు కృష్ణుడు జోక్యం చేసుకొని ఇద్దర్ని సముదాయిస్తాడు.

"లోకంలో నేను పెద్దదాణ్ణి వుంటుండగా లజ్జవిడిచి ఎవరయినా మురహరునితో సరసమాడుతారటే"

"మగడు నన్నువలచి నాదగ్గరికే వచ్చాడు. పేరుకు నీవు పెద్దదానివి అంతే"

"అలాగా, ఇంటి యజమాని దాసితో కూడా సరసమాడవచ్చు నీవు దాసివేమే"

"నేను దాసినా! కారుకూతలు కూయకు. శ్రీశుని దయారాశి నామీద వుంటె నేను దాసినెట్లవుతానే"

"కృత్య ప్రయోగించి నన్ను ద్వారకకు తెచ్చాడే"

"ఆలస్యం చేస్తే ఎక్కడ ఆత్మహత్య చేసుకొంటావేమోనని

సానుభూతితో నిన్ను తెచ్చాడు గాని మరేమీ కాదు"

"బలే చెప్పొచ్చావులే. ప్రీతితో నిన్ను మాత్రం తెచ్చాడేమిటి? ఏదో మణి ఇచ్చారుకదా అని దానితో నిన్ను తెచ్చుకొన్నాడు"

"ఎవరికి చెప్ప పట్టకుండా ప్రేమతో వచ్చినదానికి బ్రహ్మ లగ్నంలో వచ్చినదానికి పోలిక లెక్కడివే?"

"చెప్పొచ్చావులే. అభిమానంతో భక్తితో అందర్నీ వదిలిపెట్టి వచ్చిన దాణ్ణినేను. కన్యాదానమని చెబుతున్నావు. నిన్ను మీ తాత కన్యాదానం చేశేడేమిటే?"

"నన్ను శతధన్వునికి ఇవ్వాలని నిశ్చయిస్తే నాకోసం అతణ్ణి చంపాడే".

"సరేలే దుష్టుల్ని చంపడం క్షత్రియోచితమైన కార్యం. నీకోసమని ఎలా అనుకొంటావు?".

"ఇంద్రాది దేవతలతో యుద్ధం చేసి నాకోసం పా రి జా త ం తెచ్చాడే".

"వరదుడయిన రంగని చేతిలో నా బంగారు పుష్పం వుంటే నీ బాధ పడలేక నీ ఏడుపు చూడలేక తెచ్చిపడేశాడే".

"విజయయాత్రలో నన్ను కావలించుకొని తన ప్రీతిని వ్యక్తం చేశాడే".

"సుక్షత్రియులెవరు తమ ఆడవార్ని యుద్ధభూమికి వెంట బెట్టుకొని వెళ్లరులే. కేవలం దాసీజనాన్ని వెంటేసుకుని వెళతారు".

ఈలా తగవులాడుకొంటున్న భార్యల్ని లాలిస్తూ వారి అలుక తీర్చాడట కృష్ణుడు.

అన్నమయ్యలో కూడా రుక్మిణీ సత్యభామల ప్రసక్తి కనిపిస్తుంది

"సరుస రుక్మిణికి సత్యభామకును
వరుఁడగు వేంకట వరదుఁడు వీఁడే" 1–261

సత్యభామ సరసపు నగవు
నిత్యము హరిమదినే నెలవాయ

రుకుమిణీదేవికి రూపయవ్వనికి
సకల విభవముల సౌఖ్యతము.
చికురాంబరమున ఁజెదరిన యలకలు
వికచాబ్జముఖము వెయివేలాయ

దినదినంబులును తిరువేంకటపతి
చనువుల సొబగుల సంపదలాయ (12-311)

అన్నమయ్య కీర్తనలలో ఆధ్యాత్మకీర్తనలు, శృంగార కీర్తనలనే విభాగం కనిపిస్తుంది. కన్నడ హరిదాస సాహిత్యంలో ఈ విభాగం కనిపించదు. మధుర భక్తి పేరుతో వ్రేరి తలలు వేసిన శృంగారం దాస సాహిత్యంలో లేదనవచ్చును. ఇందుకు ప్రధానకారణం దాససాహిత్యం ప్రచారం చేసిన వారిలో ఎక్కువమంది సన్యాసులు కావడం. అది గాక శివశరణులలాగా ప్రజా జీవితంలో తామూ ఒకభాగంగా వుంటూ

మతాన్ని ప్రచారం చేయడం. అయితే భాగవతాన్ని ఆధారంగా తీసుకొని వ్రాసిన గోపికాగీతలు మొదలగువాటిలో మాత్రం శృంగారం భక్తి రూపంలో కనిపిస్తుంది.

శ్రీపాదరాయల కీర్తనల్లో చాల ప్రసిద్ధి పొందింది "భ్రమర గీతె" (పు. 102--109) సంస్కృత భాగవతంలో సంగ్రహంగా వున్న ఈ భాగాన్ని శ్రీపాదరాయలు విస్తరించి వ్రాశారు. గోకులానికి వచ్చిన ఉద్ధవునితో గోపికలు మాటలాడుతుండేటప్పుడు ఒక తుమ్మెద రొద చేసుకుంటూ ఎగురుతుంది. అపుడు తుమ్మెద నుద్దేశించి గోపికలు తమ ఆవేదన వెళ్లగక్కుకొంటారు. కన్నడ కీర్తనలో ఉద్ధవ ప్రసక్తి లేదు. తుమ్మెద ప్రసక్తి మాత్రం వుంది. అన్నమయ్య రచనల్లో ఉద్ధవ సంబోధాత్మకాలు వున్నాయి. మరి తుమ్మెద పదాలున్ను కనిపిస్తాయి.

ఉదా॥ ఒద్దేల మొక్కేవో వుద్ధవుఁడా తన
ఉద్దండాలే చెల్లె నుద్ధవుఁడా

ఊరూర వలపు లుద్ధవుఁడా నే
మోరుతుమా యిక నుద్ధవుఁడా
ఊరడించ వచ్చేవు వుద్ధవుఁడా తన
వూరట చెలుము లుద్ధవుఁడా

ఒప్పులర మావురిసిన పుం
డ్లుప్పులు వెట్టించె నుద్ధవుఁడా
చెప్పకు మమ్మిఁక చెలువుఁడాతఁడే
వొప్పి వుంటె జాలు నుద్ధవుఁడా

గోపికల మమ్ముఁగూరిమి ఁజిక్కించె
నోప మింతేసి నే ముద్ధవుఁడా
పైపైక మమ్మింత ప్రాణము నిలుప
నోపెఁగా తానైన నుద్ధవుఁడా

తెగి తన్నుఁ గూడే తెరఁగు దలఁచి
యుగములైనవి ఉద్ధవుఁడా
పగటున మామా ప్రాణము మాకిఁక
నొగరే తీపాయె నుద్ధవుఁడా

చెల్లించె మాప్రేమ శ్రీవేంకటేశుఁడు
వుల్లమలర నేఁడుద్ధవుఁడా
చల్లని కూటపు జనవిచ్చి మామా
వొళ్లెల్లఁజెనకె నుద్ధవుఁడా 12-56.

ఇక అన్నమయ్య శ్రీపాదరాయల రచనల్లోని సామ్యాలు చూద్దాం.

అన్నమయ్య "చేసిన కూలికి జీతమునకు సరి" (9–277) అని అంటే రాయలవారు "సాల వాయితెందు సంబళ ఎనగె సాలదెందు బేడ బందువనిల్ల" (అప్పయిండని జీతం చాలదని అడగడానికి వచ్చినవాణ్ణికాను) అని చెప్పాడు.

చవులకు జవి సంసారము (8–105) అని అన్నమయ్య అంటే ఆ సంసారం చవి గావాలంటే వుండవలసిన హంగుల్ని రాయలు-

"సతి అనుకూల బేకు
సుతనల్లి గుణ బేకు
మతివంత నాగ బేకు
మతి బందాగిర బేకు" (పుట. 100) అన్నారు.

అంటే సతి అనుకూలం కావాలి.కుమారునిలో సద్గుణాలు వుండాలి. తాను బుద్ధిమంతుడు కావాలి. అందరు ఒకతాటిపై నడవాలని అర్థం.

"వేదములే చేరులై వెలయంగ శేషుండే
పాడుకొను తొట్లలై పరగంగాను (3-474)

అని అన్నమయ్య వర్ణిస్తే ఈ భావాన్ని విస్తృతంగా చెప్పాలనే కాంక్షతో శ్రీపాదరాయలు -

"భూమియ చిన్నద తొట్టిల మాడి
సోమ సూర్యరెంబ కలశవ హూడి
నేమది వేదగళ సరపణి మాడి
ఆ మహా కాశక్కె కొండిగళ హాకి"అన్నారు.

భూమి ఒక ఉయ్యాల. సోమసూర్యులు ఆ ఉయ్యాలకు కలశాలు. వేదాలు చేరువలు. ఆ ఉయ్యాల కొండి ఆకాశానికి వేయబడిందని వర్ణన.

"ఇదనాదరు కొడదిద్దరె నిన్న
పదకమలవ నంబి భజిసువదెంతో"

ఇదయినా ఇవ్వకపోతే నీ పదకమలాలను నమ్మి సేవించడమెందు

కయ్యా అని రాయలు తన పేదరికాన్ని తన కోరికల వైముఖ్యాన్ని విశదీకరిస్తూ ప్రార్థించారు. ఈ నివేదనలోని ఆంతర్యాన్ని పరిశీలించి నట్టు అన్నమయ్య

"సొమ్ముఁగలవాఁడు తన సొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీ సొమ్మను నేను కాపాడవే హరి" 9-148

అని చెప్పారు.

"అకటకట సంసారవను నెచ్చి కెడబ్యాడ
వికటదలి మానవరు కెట్టరెల్లరు నిజ"

అనే కీర్తనలో సంసారాన్ని అంటే ఈలోకవాసాన్ని నమ్మి చెడిపో వద్దు.వికట బుద్ధితో ఇదంతా శాశ్వతమని నమ్ముకొని మానవమాత్రులెందరో చెడ్డారు. నరకాసుర, కార్తవీర్యార్జున, కౌరవ,నహుషాదులట్టి వారు, వీరందరు విష్ణుభక్తిలేనివారని అన్నారు. ఈ అభిప్రాయాలను దృష్టిలోపెట్టుకొని ఈ వాక్యార్థాన్ని పూర్తిచేసే సంకల్పంతో

"సంసారమే మేలు సకల జనులకును
కంసాంతకుని భక్తి కలిగితే మేలు" 9-158

అని అన్నారు అన్నమయ్య.

"వొడలు మాసినవాని వొనరు జుట్టములెల్ల
బడి బడినేవుండి పాసినయట్టు" 1-240

అన్నలంటా తమ్ములంటా అల్లుఁటా బిడ్డలంటా
పన్నుకొని తిరిగేరు బహురూపాలు

ఎన్నిక దినములలో నెవ్వరికి నేమేమి మిగులు
అన్నిటికి నీవె నాకు నిందిరారమణ 11-2-55

కలిగిన నాడే చుట్టరికంబులఁదిరుగులివి (9-68) అని చుట్టాల నైజాన్ని అన్నమయ్య వర్ణిస్తే శ్రీపాదరాయలుకూడా

"ఉంటాద కాలక్కె నెంటరు ఇష్టరు
బంటరాగి బాగిల కాయ్వరు
ఉంటాదతన తప్ప బడతన బందరె
ఒంటి యంతె గోణ మేలెత్తువరు" పుట. 39

అని వర్ణించారు. ఉన్నరోజుల్లో బంధువులు ప్రేమపాత్రులు. వారు సేవకులుగా వాకిలి కావలి కాస్తారు. కలిమి పోయి పేదరికం వస్తే ఒంటెలాగా పైకెత్తేస్తారు.

అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరికి నచ్చిన వుపమానాలెన్నో వున్నాయి. వాటిలో తల్లి బిడ్డలకు సంబంధించినవి ముందు పేర్కొనాలి.

"తల్లిఁబాసి బిడ్డలెల్లఁదల్లడించినట్లు నా
పలదాలెవ్వరి పాలయ్యానో తాము" 11-2-31

"ఆసఁదల్లి తండ్రిమోము అట్టిచూచి శిశువులు
యే సుఖములుఁదా మెరఁగనట్టు" 9-101

"తల్లిదండ్రులు తమ బిడ్డల తనువులఁబంకములంటినను
యేవిధముల నీరార్చి పెంతురట" 9-103

"పేరిడి తల్లిదండ్రులు బిడ్డలేమి సేసినాను
వోరుచుక ముద్దుసేసుకొందురు లోకమున"　　8–97

అనేవి అన్నమయ్య ఉపమానాలు.

"హెత్తమక్కళు హుచ్చరాదరె తాయి తందె
ఎత్తదె నెలకె బిసుడువలె గోవింద"

"కన్నబిడ్డలు పిచ్చివాళ్లయితే తల్లిదండ్రులు వారిని ఆదరించకుండా నేలకు విసిరేస్తారా"అని ప్రశ్నించాడు శ్రీపాదరాయలు. మరొకచోట

"తరళర బిడువ తాయిగళుంటె"

"బిడ్డల్ని వదలిపెట్టే తల్లులున్నారా"అని ప్రశ్నించాడు.

వీరిద్దరికి నచ్చిన మరొక వుపమానం అడవి వెన్నెల.

"అడవికిఁగాయు వెన్నెల కరణి"　　1–194

"ఇంతకాలమాయను ఏడ నున్నారో వీరు"　　9-55
వింతలై అడవిఁగాసే వెన్నలాయ బదుకు
"కాళబెళదింగళు ఈ సంసార"　　పుట. 38

వీరిద్దరికి నచ్చిన మరొక వుపమానం లోహస్వర్ణోపమానం. అన్నమయ్య

"పరుసమొక్కటి కదా పయిండిగాఁజేసేది
అరయలోహమెట్టున్నా నందుకేమి
గతియై పరుసముఁగడిసిన లోహమె
ప్రతిలేక ధరణిఁబసిడి యైనట్లు　　9-18

పరుసము సోకక పసిడౌనా 8-75

పక్కన లోహము పరుసము దాఁకిన

ఎక్కువనంతా హేమమౌ కాదా (9-250) అని ప్రయోగించారు. శ్రీపాదరాయలు కూడా ఈ భావాన్నే

"పరుషముట్టలు లోహస్వర్ణ గోవింద" (పుట. 71) వాక్యంలో విశదీకరించారు.

ఇంక కీర్తనల ఎత్తుగడలలోని సొగసుల్ని చూద్దాం.

"ఎట్టవలసినా జేయు వేలా నననేరమయ్య
ముట్టున నీమనసు నీకొప్పున సుమ్మయ్య" 4-16

అనేది."ఇట్టాంగె ఇరువెనో హరియే ఎన్న దారెయె"తో సంవదిస్తుంది.

"మోస హోదెనల్ల సకలవు వాసుదేవబల్ల"అనే ఎత్తుగడ. పు. 126

"ఎట్టు మోసపోతి నేను యివి యెల్ల నిజము
నెట్టన హరినే నమ్మనేరనయితిగా" (8-41)తో ఇంచుమించు సరిపోతుంది.

"శ్రీపాదరాయలు అన్నమయ్య కృతులలో పాదాంతంలోని కొన్ని పదాల ఆవృత్తి సమానంగా కనిపిస్తాయి.ఇది ప్రధానంగా జానపద గేయ ధర్మమని చెప్పవచ్చు.

శరణు :

అన్న: అరసి నన్నుఁగాచె నాతనికి శరణు
పరము నిహము నేలే పతికిని శరణు 4-85

శ్రీపాద: శ్రీరంగవిఠలన శ్రీమకుటకె శరణు
శరద లొప్పువ నీలకుంతలకె శరణు (పుట. 1-254)

గోవింద:

అన్న: ఇందిరా నామ మిందరికి
కుందనపు ముద్దవో గోవింద 1-8

శ్రీపాద: దురితగజపంచానన-నర
హరియె దేవరదేవ కాయో గోవింద (పుట.69)

త్రువ్వి:

అన్న: అబ్బురంపు శిశువు
ఆకు మీది శిశువు
దొబ్బుడు రోలి శిశువు

త్రువ్వి త్రువ్వి త్రువ్వి.

శ్రీపాద: జగవను హొట్టె యొళిం బిట్టె త్రువ్వి
జగవెల్ల నిర్మాణ మాడిదె త్రువ్వి
నిగమ గోచర నిత్యానందనె త్రువ్వి
మగువెందు నావ్ తూగ బల్లెలె త్రువ్వి (పు. 167)

ఈ వాగ్గేయకారులకు నచ్చిన పదాలలో శ్రీనాథ, కంతుగరుడు, సంబళ మనేవి చెప్పుకోదగ్గవి.

అన్న: శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము 1-9
మానుపవశమా మాయలివిన్నియు
శ్రీనాథుఁడ మును సేసినవే 9-71

కానరు నాలుగు కరముల వానిని
శ్రీనాథుండని చేరఁగ వలదా. 9-30

శ్రీవేంకటగిరి శ్రీనాథుడిందరి
గావఁబ్రోవఁగ నున్న ఘనుఁడు 1–187

శ్రీపాదః శ్రీనాథ నిన్నయ మత మతవె

కంతుగురుడు:

అన్నః కంతుగురుఁడు వేంకటగిరి రాయని
సంతర్పణమే మాసంధ్య.

శ్రీపాదః కంతుపితనె ఎన్న అంతరంగది
నిన్న సంతత నెనపంతె (పుట. 144)

కంతుపితనె నిన్న ఎంతు వర్ణిసె (పుట. 203)

చింతెయను మాడదిరు చదురె నినగె నాను
కంతుపితనను తోరువె (పుట. 207)

చిత్తజగురుః

అన్నః చిత్తజగురుని తలఁచుఁడీ
చిత్తజు ఁజొరనీక (పుట. 1-194)

శ్రీపాదః చిత్తజనయ్యన చింతిసుమనవే (పుట. 50)

సంబళః

అన్నః తెచ్చిన సంబళమెల్ల ఁదీరుఁబేలోలోనె 1–240

పాపములే సంబళమెపుడు యీ
ఆపదఁబడి నే నలసేనా 1-2-16

విందుల నుడువులు విష్ణుకీర్తనము
చందపు వైకుంఠ సంబళము 9-275

సాల వాయితెందు సంబళ ఎనగె
సాలవెందు బేడ బందుదిల్ల (పుట. 12)

ఇక వీరిద్దరి సంగీతాన్ని గురించి కొన్ని విశేషాలు. అన్నమయ్య శ్రీపాదరాయలిద్దరున్ను సంగీతం ద్వారా సర్వేశ్వరుణ్ణి సేవించిన వారు. ఈ విషయాన్ని వారు చాలాచోట్ల వాచ్యం చేశారుకూడా. అన్నమయ్య చెప్పిన

"సామవేద నాద వినోదుని"

"నాద బ్రహ్మపు నడుమితడు"

మొదలయిన పాదాలిందుకు సాక్ష్యాలు. ఇంక శ్రీపాదరాయల వారయితేనో "సంగీతలోలన"

"కాయజ జనకన గాయన మాడదె"

"మంగళ చరిత్రెయన్ను సంగీతదిం పొగళుత"

అని స్పష్టం చేశారు. ఇంతేగాకుండా శ్రీపాదరాయల "లాలిగోవింద లాలికౌసల్యా బాల శ్రీరామ లాలి" (పుట. 142) అనే కీర్తనలో కల్యాణి, ఆనంద భైరవి, దేవగాంధారులతో పల్లవాధరులు, లాలి పాటలు పాడినట్లు స్పష్టం చేశారు. అన్నిటికన్నా ముఖ్యంగా పరిశీలించదగ్గది కీర్తనల నిర్మాణం. వీరిద్దరి రచనలలో పల్లవి చరణాల

విభాగం స్పష్టంగా వుంది. ఈ విషయాన్నే ప్రొ॥ సాంబమూర్తిగారు


"The earliest Telugu Kirtanas are by the Tallapaka composers who belong to the 15th century. For the first time in the history of South Indian music we come across the divisions of a Song into Pallavi, Anupallavi and Charana in their works" అన్నారు. ఈ విభాగం తమిళంలోని తేవారంలోగాని, కన్నడంలోని శివశరణుల రచనల్లోగాని కనిపించదు. శివశరణులు స్వర వచన, స్వరపద, పదంగళు, గీతగళు అని వ్యవహరించారు గాని "కీర్తన" అనేమాట ప్రయోగించలేదు. వైష్ణవ సంకీర్తనల్లో అంకిత పద్ధతి కూడా ప్రవేశపెట్టడం వీరితోనే ప్రారంభమైంది. అలాగే ఇద్దరి రచనల్లోను సుళాదులు కనిపిస్తున్నాయి.

శ్రీ పాదరాయల కీర్తనలలో భైరవి, ఆరభి, ఆహిరి, కల్యాణి, కాంబోది, కేతారగౌళ, గుండక్రియ, గూర్జరి, తోడి, ధన్యాసి, దేశి, నాట, నాదనామక్రియ, నారాయణి, పాడి, పున్నాగవరాళి పూర్వి, బౌళి, భైరవి, మధ్యమావతి, మాయామాళవగౌళ, మాలవశ్రీ, ముఖారి మోహన, రేగుప్తి, వరాళి, వసంత, శంకరాభరణ, శుద్ధసావేరి, శ్రీ, సారంగ, సావేరి, సురటి, సౌరాష్ట్ర, హిందోళ రాగాదులు కనిపిస్తాయి.

అన్నమయ్య రచనలలో సుమారు 89 రాగాలు కనిపిస్తున్నాయని ప్రసిద్ధ సంగీత విద్వాంసులు ఎస్. ఆర్. జానకి రామన్ గారు తెలియజేశారు. వాటిలో దేశాళం, గుమ్మకాంభోజి, కోకిలపంచమ,

కొండమలహరి, మంగళభౌళి, ముఖారి పంతువరాళి మొదలయిన వాని వునికి తెలియడం లేదని కూడా అన్నారు.

అన్నమయ్య కీర్తనలు రాగిరేకులలో భద్రపరచబడినట్లు, శ్రీ పాదరాయల కీర్తనలు భద్రపరచబడలేదు. తాళ్లపాక వాగ్గేయకారులలో అన్నమయ్య నిలదొక్కుకున్నట్లు, ఇతరులు నిలదొక్కుకోలేక పోయారు. కాని శ్రీ పాదరాయల శిష్యులయిన వ్యాసరాయలు గురువును మించిన శిష్యులయి వెలిశారు. అందువల్ల వారి సంకీర్తనల తేజోరాశిలో శ్రీపాదరాయలవారివి అణిగిపోయి కొన్నే కనిపిస్తున్నాయి అయినా ఇటు తెలుగులో అన్నమయ్యకు, కన్నడంలో శ్రీ పాదరాయలకు వాగ్గేయకారులలో అగ్రస్థానమే లభించినదనడం సత్యం.



# అన్నమయ్య–పురందరదాసు

తాళ్లపాక అన్నమయ్య పురందరదాస పదాలలోని భావసా దృశ్యాలను పరిశీలించడానికి ముందు వారిరువురి జీవిత విశేషాలను గురించి ప్రస్తావించడం సమంజసం.

తాళ్లపాక అన్నమాచార్యుల కాలం గురించి ప్రధానంగా రెండు అభిప్రాయాలున్నాయి.

మొదటిది అన్నమయ్య క్రీ. శ. 1408-1503 కాలంనాటి వాడనడం. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీవేంకటేశ్వర వచనాల పీఠికలో ఈ వాదాన్నే ముందు ప్రస్ఫుటం చేశారు. శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, శ్రీ చాగంటి శేషయ్యగారు ఈ అభిప్రాయంతో ఏకీభవించారు. మాన్యులు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, ఆచార్య జి. యన్. రెడ్డిగారు కూడా ఈ వాదాన్ని అంగీకరించడంతో శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టిగారు క్రీ.శ. 1408 మే నెల 8వ తేదీన అన్నమయ్య జన్మించారనడాన్ని ప్రమాణంగా స్వీకరిస్తున్నట్లు తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవసంచికలో పేర్కొన్నారు.

రెండవది అన్నమయ్య క్రీ. శ. 1424-1503 కాలంనాటి వాడనడం. ఈ అభిప్రాయాన్ని శ్రీ వేటూరివారు అన్నమాచార్య చరిత్రపీఠికలో వెలిబుచ్చారు. అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైతేను అనే వాక్యమాధారంగాను ఇతర ఉపపత్తులతోను అన్నమయ్య క్రీ. శ. 1424 లోనే జన్మించాడని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు భావించారు. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులవారున్ను, డా॥ముట్నూరి సంగమేశం

గారున్నూ. క్రీ. శ. 1424–1503 వాదమే సరి అయిందని భావించారు. అయితే ఉపలబ్ధమయిన ఆధారాలబట్టిన్నీ, రాగిరేకుల్లోని వాక్యరచనావిధానం బట్టిన్నీ చాలమంది పెద్దలు అభిప్రాయాలను మన్నించి అన్నమయ్య 1408 సర్వధారి సంవత్సరం నిజ వైశాఖ మాసం శుక్లచతుర్దశి బుధవారం జన్మించినట్లుగా నిర్ధారించుకొని తిరుమల తిరుపతి దేవస్థానంవారు 1977 నుండి జయంతి ఉత్సవాలను మొదలెట్టారు.

ఇంక పురందరదాసు కాలంగురించి పరిశీలిద్దాం. అన్నమయ్య కాల వివాదం లాగే పురందరదాసు కాలంగురించి కూడా అభిప్రాయ భేదాలున్నాయి. డా॥ ఎం. వి. కృష్ణారావుగారు పురందరదాసు కాలం 1484–1564 గా పేర్కొన్నారు. డా॥ వేటూరి ఆనందమూర్తిగారు క్రీ. శ. 1470–1564గా నిర్ణయించారు. శ్రీ కె. అప్పణ్ణాచార్యగారు పురందరదాసు క్రీ. శ. 1480-1564 నాటివాడని నిర్ణయించారు.

పై పరిశీలనవల్ల అన్నమయ్య కాలాన్ని 1408–1503 గాను, పురందరదాసు కాలన్ని 1480–1564 గా నిర్ణయించినా వీరిద్దరు సమకాలికులనడం తప్పు కాదు. అదీగాక తాళ్లపాక చిన్నన్న అన్నమయ్య పురందరదాసుల పరస్పర సంభావనాదులగూర్చి విశదీకరించడం వల్ల అన్నమయ్యవృద్ధాప్యంలో పురందరదాసు ఆ మహానుభావుణ్ణి కలుసుకొన్నట్టు స్పష్టమవుతుంది. ప్రసిద్ధ కన్నడ విమర్శకులు డా॥ ఎం. వి. కృష్ణారావుగారు ఈ అంశం సత్యమని విశ్వసించారు.

ఇక అన్నమయ్య, పురందరదాసుల జీవిత విశేషాలు గురించి పరిశీలిద్దాం:

అన్నమయ్య కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామంలో లక్కమాంబా నారాయణసూరులకు జన్మించినవాడు. పురందరదాసు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమయిన పండరపురసమీపంలోని పురందరగడలో పుట్టినవాడు. ఇతని తండ్రిపేరు వరదప్పనాయకుడు తల్లిపేరు నిర్దిష్టంగా తెలియదు. అన్నమయ్య స్వామి నందకాంశంతో జన్మించారని, నారదుడే పురందరదాసుగా అవతరించారని ప్రజలలో బాగా ప్రచారముంది. బాల్యంనుండి అన్నమయ్య శ్రీవేంకటేశ్వర స్వామి భక్తుడు. పురందరదాసు బాల్యంనుండి భక్తుడు కావచ్చు నేమోగాని నడివయసులో సంపూర్తిగా విఠల భక్తుడయ్యారనడం మాత్రం సత్యం. అన్నమయ్య వైష్ణవ స్వీకారానికి ఘనవిష్ణువు కారణ మయితే పురందరదాసు హరి "దాసదీక్ష"కు వ్యాసరాయలు దోహదం చేసినవారే. సాళ్వనరసింహరాయలనే రాజుతో అన్నమయ్యకు ప్రత్యక్ష సంబంధం వుందిగాని పురందరదాసుకు ఏ రాజుతోనూ సామీప్య సంబంధం లేదు. అన్నమయ్య వైష్ణవుడయినా, పురందరదాసు మాధ్వుడయినా ఇద్దరూ భక్తిమతాన్ని ప్రచారం చేసినవారే. అన్న మయ్య సంతతిలాగే పురందరదాసులవారి కుమారులుకూడా వాగ్గేయ కారులుగా రాణించారు.

విజయనగర చక్రవర్తులందరు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు కావడంవల్ల కన్నడగులకు తిరుపతితోడి అనుబంధం పెరగడానికి వీలయింది. సాళ్వ నరసింహరాయుల కాలంలోనే అన్నమయ్య పదాలు విజయనగర ప్రాంతంలో వ్యాప్తి పొందాయనడం తప్పుకాదు. కన్న

డాంధ్ర భాషలకు వున్న భౌగోళిక, రాజకీయ, సాంఘిక సంబంధాల వల్ల కూడా సాహిత్యంలో ఆదానప్రదానాలు పెరుగుతూ వుండవచ్చు. ఆ కారణాలవల్ల అన్నమయ్య పురందరదాసుల పదాలను తులనాత్మకంగా పరిశీలించడం సమంజసమే అందువల్లనే శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు "తాళ్లపాకవారి రచనలకును పురందరదాసాదుల కీర్తనలకును భావమందును పదప్రయోగమునందును మాత్రమే గాక పద రచనా వైవిధ్యంనందును పదస్వరూపమునందును గూడ సామ్యమెంతో యున్నది.దీనికా భజనపరుల సాన్నిహిత్యమేకారణమని నా తలంపు"అని తెలియ జెశారు.

అన్నమయ్య పురందరదాస పదాలలోని సాదృశ్యాలను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

1. మత సాదృశ్యాలు.
2. వర్ణనా సాదృశ్యాలు.
3. రచనా సాదృశ్యాలు.

ఈ మూడు విధాల వర్గీకరణతో వారిరువురి రచనలలోని సాదృశ్యాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

మత సాదృశ్యాలు:

తాళ్లపాక అన్నమయ్య పురందరదాసు లిద్దరున్నూ వైష్ణవులే. కాని అన్నమయ్య తొలుత నందవరీక బ్రాహ్మణులు. పురందరదాసు దాసదీక్ష స్వీకరించడానికి ముందు మాధ్వుడో కాడో ఖచ్చితంగా

నిరూపించే ఆధారాలు లేవు. మతం పుచ్చుకొన్న తొలి రోజుల్లో ఆ మతం పట్ల ఆత్యాదరం ఆ మతాల ఆచారవ్యవహారాలపట్ల అనురక్తి ఏర్పడడం సహజమే. ఈలాంటి సందర్భాల్లోనే పరదైవనింద, పర మతదూషణ మనేవి చేరుతుంటాయి. ఈ సాదృశ్యం ఇద్దరి రచనల్లోను కనిపిస్తుంది.

అన్నమయ్య శ్రీమన్నారాయణుని పురుషోత్తమత్వాన్ని నిరూపించడం కోసం

"కైలాసము రుద్రుఁడు గల బ్రహ్మాండకోట్లు
పోలించి విష్ణుఁడు కడుపున నించుకుండఁగాను
చాలిమూఁడు మూర్తులలో సరి యితఁడంటాను
నూళ్లై యాడేరుగాక కూడునా లోకులకు

ఘనుఁడీతని పాదము గడిగె బ్రహ్మదేవుఁడు
మునుముట్టి శిరసున మోఁచె శివుఁడు
వొనర మూఁడు మూర్తులందొకఁడు శ్రీవేంకటేశుఁ
డనుమాట యిది తగవు నా లోకులకు" (6-18)

అని చెప్పారు. ఇదే విధంగా "అహం బ్రహ్మాస్మి" సిద్ధాంతాన్ని–

"ఏఁటి మాటలివి విన నింపయ్యీనా మది....
జీవుఁడే దేవుఁడని చెప్పుదురు గొందఱు
దైవము చేతలెల్లాఁదమ కున్నవా" (6-67) అని

ప్రశ్నించారు.

నిరాకార బ్రహ్మను గూర్చి—

"ఘటన బ్రహ్మము నిరాకారమయితే బరియించ
నిటు పురుష సూక్తాదు లవి మరేల" (6-67) అని

నిలదీసి అడిగారు.

"పుట్టుగులు గెలిచి నిన్నుఁబొందుట కుపాయము
అట్టె నీ రూపమైన ఆచార్యుఁడే
యిట్టె శ్రీవేంకటేశ! యిన్నిటికి నుపాయము
మట్టులేని రామానుజమతము చేకొనుటే" (7-100)

అని వైష్ణవం పుచ్చుకోవడ మొక్కటే శరణ్యమని తేల్చిచెప్పారు.

ఇదే మోస్తరు పురందరదాసుకూడా ద్వైతమతసిద్ధాంతాల్ని చెబుతూ "సత్యం జగతిదు"(753) (ఈ జగత్తు సత్యమయింపే)జీవ ఈశగె భేద సర్వత్ర (753) (జీవాత్మ పరమాత్మలకు భేదం సర్వత్ర వుంది)అని చెప్పడమే గాకుండా "మాయావాది మతక్కె బెంకియ హచ్చు(771)(మాయావాదమతానికి నిప్పుపెట్టు)అని కటువుగా శాసించారు. హరి సర్వోత్తమనెందు స్మరిసద జనరసంగబేడ(426) (హరి సర్వోత్తముడని స్మరించని జనులతో సహవాసం చేయవద్దు) అంటూ "మధ్వమత సిద్ధాంత పద్ధతి బిడబేడ బిడబేడ బిట్టు కెడబేడ బిట్టు కెడబేడ" మధ్వమత సిద్ధాంత పద్ధతుల్ని వదలిపెట్టవద్దు. వదలి పెట్టవద్దు. వదలి చెడిపోవద్దు. చెడపోవద్దు)అని తనమతం గొప్పదని అనుశాసించారు.

అయితే వయసు పండుతున్నకొద్దీ, అనుభవాలు పెరిగేకొద్ది, విశాల దృష్టి సంతరించుకొనేకొద్ది వారు ఈలాంటి సంకుచిత పరి

ధుల్ని వదలి సామ్యవాద ధోరణిలో సర్వమానవ సముద్ధరణానికి పాటుపడ్డారనడంలో సందేహం లేదు.

తాళ్లపాక అన్నమయ్య శ్రీవేంకటేశ్వర భక్తులు. పురందరదాసు విఠల భక్తులు. వీరిద్దరూ విస్తృతంగా దేశాటనం చేసినవారే. ఆయా గ్రామాలలోని దేవతల్ని మనసారా కీర్తించినవారే. అయితే అన్నమయ్య విఠల సంకీర్తనంలోను, పురందరదాసు శ్రీనివాససంకీర్తనంలోను కొట్టవచ్చినట్టు ఒక విశేషం కనిపిస్తుంది.

దాక్షిణాత్య వైష్ణవులకు శ్రీరంగం, కంచి, అహోబలం, తిరుపతిక్షేత్రాలున్ను.ఆయా ప్రదేశాలలో సాక్షాత్కరించిన మూర్తులున్ను ఆరాధ్యమయినట్టు పండరపురంగాని,అక్కడి విఠలమూర్తిగాని సేవ్యమానమయినట్టు కనిపించడంలేదు. విఠలమూర్తి శివాత్మకమని, ఆ దేవుడు మహారాష్ట్ర అద్వైతులయిన "వర్కరులన" బడేవారికి కులదేవుడు కావడమనే అభిప్రాయం ఉండడంవల్ల చాలకాలం వరకు వైష్ణవులు దర్శించే క్షేత్రంగాకపోయిందని కొందరి అభిప్రాయం. అయితే విజయనగర సామ్రాజ్యాధిపత్యంలో దక్షిణదేశమంతా వొకరి పరిపాలనకింద రావడంతో ఈ విభేదాలు చాలవరకు సన్నగిల్లాయి. చాలచోట్ల విఠలమూర్తులు వెలశాయి. పండరపురం వైష్ణవులకు దర్శనీయస్థలమయింది.విజయనగరంలో విఠలారాధన ప్రత్యేకతను సంతరించుకొన్నది. అయినా ఈ విభేదాలు ప్రజలలో వుండనే వున్నాయి. వీటిని పూర్తిగా తొలగించడానికి కంకణం కట్టుకొన్నవారు అన్నమయ్య, పురందరదాసులు. తిరుమలయందును, విద్యానగరంలోను భజన కూటాలు నడుపుతూ విఠలుని మీద వందలకొలది పదాలు

రచించారు.

అన్నమయ్య విఠలుని కీర్తించిన కీర్తనలన్నింటిలోను అతడు "సాక్షాత్ వేంకటేశ్వరుడే"అనే అభిప్రాయాన్ని స్పష్టంచేశారు. ఉదా:

తుంగభద్ర యేటికాడ తేరమైన కొండనీడ
రంగు మీరి పైడిగోడ రాతిమేడ
అంగడి నున్నాడు....

మక్కువ వేంకటగిరి మాయదారి దేవుఁడై
ఎక్కడా నెదురులేక యీడనున్నాఁడిడివో 4-26

బల్లిదపు శ్రీ వేంకటపతివై పాండురంగాన
చల్లగా నెలకొంటివి జయవిఠ్ఠలేశ్వరా 10-171

వేవేల చందాలవాఁడు విఠలేశుఁడు
భావించ నలవిగాని పరమాత్ముఁడితఁడు
సిరులు మించిన యట్టి శ్రీ వేంకటాద్రి మీఁది
నిరతి దాసుల పాలి నిధాన మితఁడు 11-1-173

కంటి కంటి వీఁడివో కని కృతార్థుండనైతి
వింటినింవరిచేతా నీ విట్ఠలేశు సుద్దులు....
ఈ మూరితా పాండురంగ మిరవై వుండినవాఁడు
కామించి మూరితి శ్రీవేంకటగిరి నున్నవాఁడు
11-1-203

అదిగో విజయనగరమందు వాడల వాడల
పెద జల్లె పరముల విట్ఠలుఁడు

ఉడటు శ్రీవేంకటాద్రి నుండి వచ్చి గుడిలోన
సదన రుక్మిణి దాసునదె విట్ఠలుఁడు 3-229

పురందరదాసు పదాలలో శ్రీవేంకటేశ్వరాత్మక సంకీర్తనలు చాలా వున్నాయి. తిరుమల వాతావరణాన్ని, స్వామిని సేవించే విధానాన్ని, స్వామి ఉత్సవాల్ని చాలా కీర్తనలలో పురందరదాసు వర్ణించారు. శ్రీనివాసుణ్ణి విఠల స్వరూపంలో దర్శించారు. ఉదాహరణకు ఈ క్రింది పాదాలు చూడండి-

శరణు నినగె శరణెంబరు విఠల
కరుణ వారిధి ఎన్నుకాయో విఠల....

కండె నా నిన్న వెంకట నెంబ విఠల 543

శ్రీ వేంకటేశ్వరుడనే విఠల మూర్తిని దర్శించారట పురందరదాసుల వారు.

ఇంతేగాకుండా విఠలమూర్తి వివాదానికి స్వస్తి చెబుతున్నట్లు వైష్ణవులకు బదరి, ప్రయాగ, అయోధ్య, మధుర, సింహాద్రి, శ్రీరంగం లోని మూర్తులన్నీ వొకటే అనడాన్ని అన్నమయ్య "అన్నిచోట్ల పరమాత్మ నీవు" (5-18) అనే సంకీర్తనలో స్పష్టం చేశారు పురందరదాసు కూడా ఇదే మోస్తరు "కూసు కండెనమ్మ" (97) అనే కీర్తనలో వడ్డికాసులవాడై శేషగిరిమీద నెలకొన్నాడని, బలిని వంచించి జగమంత నిండి కంచి పట్టణంలో నెలకొన్నాడని, గోవుల్ని కాచి జగన్నాథంలో వున్నాడని, పాలుపెరుగు కడవల్ని పగలగొట్టి ఉడిపిలో వున్నాడని, మంగళరేఖలున్న రంగపురందరవిఠలుడు శ్రీకృష్ణుడని

విశదీకరించారు.

శ్రీ వేంకటేశ్వరుడు కాంచనబ్రహ్మ
ఉడిపి శ్రీకృష్ణుడు అన్నబ్రహ్మ
పురందర విఠలుడు నాదబ్రహ్మ

అంచేతనే విఠలుని ఆరాధించిన వారందరు సంగీతానికి ప్రాధాన్య మిచ్చారు.

నాదప్రియ సకలలోకపతి (2–92) "నాదబ్రహ్మపు నడుమి తడు"(11–2–23)అని అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి స్తుతించడంలో విఠలవేంకటేశ్వర వివాదం తీరినట్లున్నది.

వైష్ణవ తత్త్వంలో దైవం తరువాత గురువుకే స్థానం. తరుణో పాయం సూచించే ఆచార్యుడే ప్రత్యక్షదైవం.

నిర్మలో నిరహంకారో నిశ్శంకో నిర్వికల్పక:
తమోవిహీనః శాస్త్రజ్ఞః పరమార్ధ విచింతకః

అనేవి ఆచార్య లక్షణాలు. అన్నమయ్య పురందరదాసులిద్దరు తమ పదాలలో విస్తరంగా తమ గురుభక్తిని ప్రదర్శించారు. అన్నమయ్య శఠగోపమునిని (2–117), రామానుజుల్ని (7–138) వేరువేరున స్మరించినా ఇతరత్రా కూడా గురుభక్తిని పరోక్షరూపంలో స్పష్టం చేశారు. ఉదాహరణకు–

"వైష్ణవుండై యాచార్య సేవ సేయుటే బుద్ధి" (6-195)
"గురువు గలవానికి కొఱంత యేమియులేదు" (7–20)

"హరి నిరూపము నాకు నాచార్యుఁడు మున్నె
కెరలి నాపాల నప్పగించినాడు" (11-1-131)

"పలుమారు గురుసేవ జరఁగఁగా జరఁగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానము బొడసూపు" (11-1-119)

"ఎట్టయినాఁజేసుకో యిక నీ చిత్తమునన్ను
పట్టిచ్చె మాగురుఁడు నీపాదాలు విడువను" (8-95)

"ఆతుమలో నజ్ఞాన మాచార్యుఁడే బాపె
అతల జన్మాల వాకిలిటు ముయ్యరో" (6-145)

"జీవుఁడా వేసరకు చిత్తమా జడియకు
దైవముఁగరుణించే దడవుఁగాదు
తోవఁజూపె మనకు తొల్లే ఆచార్యుఁడు
కావలసినట్లయ్యో" (8-99)

పురందరదాసు కూడా అన్నమయ్యలాగే గురుభక్తిని, గురువు యొక్క స్థానాన్ని తన పదాలలో ప్రదర్శించిన విధానం చూడండి-

"గురువిన గులామనాగువ తనక దొరెయ దణ్ణ ముకుతి"
(కీ. 195)

(గురువునకు దాసుడు కానంతవఱకు ముక్తిలభ్యంగాదు)

"భక్తరిగె గురువినొళు ముక్తిబేడువ చింతె" (కీ. 73)

(భక్తులకు గురువునుండి ముక్తి ఉపాయం పొందాలనే
చింత)

"రామ నామవ నుడి నుడి గురుగళ చరణవ హిడి హిడి"

(కీ. 773)

(రామనామాన్ని కీర్తించు గురువుల పాదాలను పట్టుకో)

"హరి గురుగళి గెరగదె హరిభక్తి ఒదగువదె"

(ఉగాభోగ. 12)

(హరిగురువుల పాదాల వాలకుండా హరిభక్తి దక్కుతుందా?)

"గురు దైవ వరియద హిరియ నాదరేను" (కీ. 166)

(గురుదేవుల్ని తెలియనివాడు పెద్దవాడయితేనేం)

అన్నమయ్య రామానుజులను గీర్తించినట్లే పురందరదాసు మధ్వాచార్యులను వేనోళ్ల కొనియాడుతూ ఎన్నో పదాలు (కీ. 552, 698, 720) వ్రాశారు.

విశిష్టాద్వైత సిద్ధాంతాలను అన్నమయ్య తన కీర్తనలలోను, పురందరదాసు ద్వైత సిద్ధాంతాలను తన పదాలలోను విశదీకరించినా వారిద్దరున్నూ భక్తితత్త్వానికే ప్రాధాన్యమిచ్చారు. అన్నమయ్య ఉన్మాద, పతివ్రత, విజ్ఞాన, ఆనంద, రాక్షస, తురీయ, తామస, వైరాగ్య, రాజస, నిర్మల, భక్తిభావాలను చెప్పగా పురందరదాసు నవవిధభక్తులకే (తప్పదె నవవిధ భక్తి జ్ఞానగళింద) ప్రాధాన్య మిచ్చారు. వీరిద్దరిదిన్నీ చదివినేర్చిన వేదాంతముకాదని, భగవద్దత్తమై జన్మసిద్ధమైనదేనని గురూపదేశము దానికి మెరుగు మాత్రమే నని తెలియుచున్నది.

ఇంక అన్నమయ్య, పురందరదాసుల పదాలలో వర్ణనా సాదృ

శ్యాలను పరిశీలిద్దాం.

కవిత్వానికి ఉక్తివైచిత్రి ప్రాణం. వస్తువు ఒకటయినా ఉక్తి భణితివల్ల అది నిత్యనూతనత్వాన్ని సంతరించుకొంటుంది. ఈ అభిప్రాయాన్నే ఆనందవర్ధనులవారు సెలవిచ్చారు.

దృష్ట పూర్వాఅపిహ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్
సర్వే నవా ఇవా భాన్తి మధుమాస ఇవ ద్రుమాః (4-4)

అన్నమయ్య ప్రతిభావ్యుత్పత్తులు అనంతమయినవి. ఆ మహానుభావుని లోకజ్ఞత అపారమైనది. ఆ కవి కల్పనలను తస్కరించిన ప్రబంధకవులున్నారు. పదాలను యథాతథంగా వాడుకొన్న కవులున్నారు. పండితపామరకవిగా అన్నమయ్య సాక్షాత్కరిస్తారు. కాని పురందరదాసు సామాన్య జనావళికే పదాలు వ్రాశారు. గానం చేశారు.అందువల్ల "నేలవిడిచినసాము"అతని పదాలలో కనిపించదు. అన్నమయ్య శృంగార సంకీర్తనలు, అధ్యాత్మసంకీర్తనలు ఇంచుమించు సమానంగా వ్రాశారు.కాని పురందరదాసు రచనలలో గోపికా గీతలు తప్పించి శృంగారాత్మక పదాలు లేవనే చెప్పాలి.

అన్నమయ్య పురందరదాసుల పదాలలో సమానంగా కనిపించే కొన్ని వస్తువ్యక్తి చిత్రణలను చూద్దాం.

భగవంతుని దివ్యావతారాలను వర్ణించడంలో భక్తుడు పరమానందం పొందుతుంటాడు.అవతారాలు అనేక మయినా వాటిలో దశావతారాలకే ప్రాధాన్యం. అన్నమయ్య భగవంతుని భూతంగా, (11-3-43) బోయనాయకునిగా (5-285) చిత్రీకరించారు. చివరకి

దేవుణ్ణి దొంగగాకూడా నిరూపిస్తూ వర్ణించారు.

వీఁడివో యిదె వింత దొంగ
వేఁడి పాలు వెన్న వెరచిన దొంగ

వెలయ నీటఁజొప్పు వేసేటి దొంగ
తలఁగాన నీక దాఁగు దొంగ
తలకక నేలఁదవ్వేటి దొంగ
తెలిసి పందెకాడఁదిరిగేటి దొంగ
తలకక నేలఁదవ్వేటి దొంగ.

అడుగు కిందలోక మడఁచేటి దొంగ
అడరి తల్లికి నైన నలుగు దొంగ
అడవిలో నెలవై యున్న దొంగ
తొడరి నీలికాసెతో నుండు దొంగ.

మోసమింతులఁజేయు మునిముచ్చుదొంగ
రాసి కెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటువచ్చి వేంకటగిరి మీఁద
మూసిన ముత్యమై ముదమందు దొంగ. (11-3-110)

ఈ కీర్తనలో వరుసగా మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి అవతారాలు చెప్పబడ్డాయి. పురందర దాసు కూడా దశావతారాలను శిశుగీతరూపంలోను (263, 582) రత్నాలహార రూపంలోను (కీ. 373), అప్పుపుచ్చుకొన్నవానిగాను (కీ. 419) వర్ణించారు. భగవంతుణ్ణి చోరత్వ, లోభత్వ లక్షణాలు

గలవానిగా చిత్రీకరించిన ఈ కీర్తన చూడండి

"ధరణిగె దొరె యెందు నంబిదె—ఇంథ
పరమలోభి యెంబుదరియె శ్రీహరియె

కాడి బేడిద వరిగె కొడలొరదె అంజి
ఓడి నీరొళు సేరికొండె బేగ
హేడియ తెరదలి మోరెయ
తోరదె ఓడి అరణ్యాది మృగగళ సేర్దె.

ఒడవర బిన్నహ లాలిసదె హల్ల
కడుకోపదలి తెర దంజిసిదె
తడెయదె భిక్షుక నాదరె బిడరెందు
కొడలియ పిడిదు కోడగ హింద కాయ్దె

ఉత్తమ నెందరె మత్తె చోరనాదె
బత్తలె నింతె తేజియ సేరిదె
ఎత్త హోదరు బిడె మత్తె నిన్నను దేవ
చిత్తజజనక శ్రీపురందర విఠల" (కీ. 730)

"నీవు లోకానికంతా దొరవని నమ్మాను" ఈలాంటి పరమలోభివని నాకు తెలియదు. దైన్యంగా అడుక్కొన్నవారికి ఇవ్వకుండా భయపడి పరుగెత్తి నీళ్లలో దాక్కొన్నావు. పేడిలాగా మొఖం చూపకుండా పారిపోయి అరణ్యంలో మృగాలను చేరుకొన్నావు. పేదోళ్ల విన్నపాల్ని వినకుండా కోపంతో భయపెట్టావు. భిక్షుకుడయితే వదలరని ఆ తర్వాత కొడవలి పట్టావు. ఉత్తముడని అనుకొంటే దొంగవయ్యావు.

దిగంబరుడవై గుర్రమెక్కావు. అయినా నిన్ను వదలనులే". ఈ కీర్తనలో మత్స్యాద్యవతారాలు చక్కగా వర్ణింపబడ్డాయి. తలగాన నీక దాక్కోవడం లాంటివి దొంగలక్షణాలుగా అన్నమయ్య వర్ణిస్తే, ఎక్కడ తన్ను డబ్బు అడుగుతాడోఅని లోభి దాక్కోవడం అనే అంశాన్ని రమణీయంగా పురందరదాసు వర్ణించారు. నీట్లోదాక్కొన్నావు అనడంలో మత్స్య కూర్మాదులు రెండూ వర్ణింపబడ్డాయి.

దివ్యలీలాభివర్ణనం—ఫలోపమానం:

భగవంతుని దివ్యలీలావిలాసాలెన్నో. అవన్నీ లోకసంక్షేమార్థమే భక్తజన ప్రీత్యర్థమే. భగవంతుడొక ఫలం. ఆ ఫలం వల్ల ఫలితం పొందేవారు లోకులే. అన్నమయ్య దైవలీలల్ని రకరకాల ఫలాలుగా భావించి వ్రాసిన కీర్తన పరిశీలించదగ్గది.

"తినరాని కొనరాని దేవలోకపుఁబండు
మనసున తలఁచితే మలిగించే పండు

పంటకెక్క పాలవెల్లిఁబండిన పాలపండు
తిండి గొల్లెతల మోవి దొండపండు
అంటుకున్న మేని చాయ నల్లనేరేడుపండు
ముంటి సింహపు గోళ్ల ముండ్లపండు

ఇచ్చల వేదశాస్త్రాలఁదెచ్చిన పేరీతపండు
తచ్చిన దైత్యమారి దేవదారుఁబండు
పచ్చిపీర మెరసిన బండి గురువిందపండు
యిచ్చవలె నున్నవారి యింట నంటిపండు

తెమ్మగా మునుల పాలి తియ్యని చింతపండు
తెమ్మల సిరివలపుఁదేనెపండు
యిమ్ముల శ్రీవేంకటాద్రి నింటింటి ముంగిటిపండు
కొమ్మల పదారువేల గొప్ప మామిడిపండు.

(13-284)

అన్నమయ్య పేర్కొన్న పళ్లకన్నిటికిని రంగులోను,రుచిలోను, రూపంలోను తేడా వుంది.దొండపండు,నేరేడుపండు,గురువిందపండ్లు రంగుకోసం చెప్పబడ్డాయి.పాలపండు,చింతపండు,తేనెపండు రుచికి సంబంధించినవి. ఈతపండు,ముండ్లపండు, మామిడిపండు మొదలయినవి అందుకోవడంలోని సౌకర్యాన్ని ఇబ్బందుల్ని చెప్పేవి.

అన్నమయ్యలాగే పురందరదాసు దివ్యలీలలను, ఫలోపమానంతో పేర్కొన్నారు. అన్నమయ్య పండు అని చెప్పారుగాని ఆ ఫలమెక్కడనుండి వచ్చిందో చెప్పలేదు. పురందరదాసు ఆ ఫలానికి కారణమయిన బీజం ఎక్కడనుండి తేబడిందో,ఎవరుతెచ్చారో,ఎవరు నాటారో, ఎవరివల్ల దోహదక్రియలు చేయబడ్డాయో, ఎప్పుడు ఆ మొక్క పుష్పించిందో,ఎపుడు మొదటి సారిగా ఫలితం కనిపించిందో అనే బీజఫలపరిణామాన్ని“నారాయణనెంబ”(కీ.668)అనే కీర్తనలో పేర్కొన్నారు. ఆ పండు సామాన్యమయిన ఫలలక్షణాలకంటె ఏ విధంగా భిన్నమయిందో “హణ్ణు బందెదె”ఆనే కీర్తనలో విశదీకరించారు.

హణ్ణు బందిదె కొళ్లిరో నీవీగ
చిన్న బాలకృష్ణనెంబో చన్నె--బాళె

హవ్యకవ్యవ హణ్ణు సవివ సక్కరె హణ్ణు
భవరోగ గళన్నెల్ల కళెవ హణ్ణు

నవనీత చోరనెంబో జవన అంజిప హణ్ణు
అవనియొళు శ్రీరామ నెంబో హణ్ణు

కొళెతు హోగువుదల్ల హుళుతహోగువుదల్ల
కళెదు బీసాడికొళ్లువుదల్ల అళతె కొంబువుదల్ల
అళికచ్చి తింబోదల్ల ఒళితాద హరియెంబోమావినహణ్ణు

కెట్టు నారువుదల్ల బిత్తి బెళెయోదల్ల
కష్టది హణకొట్టు కొంబువదల్ల
సృష్టి యొళగె నమ్మపురందర విఠల
కృష్ణరాయనెంబో శ్రేష్ఠాదహణ్ణు (కీ. 732)

ఈలాగే హణ్ణుబందిదె జనరు హణ్ణు కొళ్లిరో (కీ. 423) (పళ్లు వచ్చాయి ప్రజలారా పళ్లుకొనండి) అనే కీర్తనలో "గిరియమేలిప్ప అలమేలుమంగ అరసనాద పురందర విఠలనెంబో జంబునేరళె (కొండలపై నెలకొన్న అలమేలుమంగ నాయకుడయిన పురందర విఠలుడనే నేరేడిపండు) అని ఉపమించారు. ఇది అచ్చంగా అన్నమయ్య "అంటుకొన్న మేనిచాయ అల్లనేరేడు పండుతో సరిపో తుంది. కాకుంటే అన్నమయ్య రంగుకు ప్రాధాన్యమిస్తే పురందర దాసు కొండనేరేటి రుచిని కూడా జతచేశారు.

తినరానిది, కొనరానిదని అన్నమయ్య చెబితే కొనదగింది, తినదగిందని చెప్పడం మాత్రమే పురందరదాసు పదంలోని భేదం.

నవవిధ భక్తి భేదాలలో "కీర్తనం" ఒకటి. "అనురక్తిః పరేతత్త్వే భక్తి రిత్యభిధీయతే" పరమైన పరమాత్మపట్ల అపరిమితమయిన ప్రీతి భక్తి. మోక్షసాధనసామగ్రులలో భక్తి గొప్పది. దయామూర్తులయిన అనంతకల్యాణగుణపరిపూర్ణులయిన భక్త కోటుల సంరక్షణార్థం అవతరించిన వారిని స్తోత్రం చేయడం కీర్తనం. స్వామికే అంకితాలయి, స్వామినే నాయకునిగా, ఆ దేవుని లీలావిశేషాలను కీర్తించడం చేత సంకీర్తన లనబడ్డాయి.

మానవజన్మ రుజా, జరాదులకు లోనుగాకతప్పదు. రుజల నివారణకు అన్నమయ్య ఎన్నో మందుల్ని సూచించారు. ఈ మందు గురించి వేటూరివారు- "తెలియని శరీర యంత్రంలో తెలియని మనము తెలియని మందును తెలియని మోతాదులో ప్రయోగించి గ్రుడ్డియెద్దు చేజడ్డట్టుగా ఆరోగ్య విషయముల యాత్ర సాగించు చున్నాము. అన్నమాచార్యులన్నట్టు మనము నిజముగా స్వామి యాజ్ఞానువర్తులమై శరణాగతులమైతే ఆయన మనలను రక్షించుటే గాక మన ద్వారా లోకమునెల్లను రక్షింపగలరు" అని స్పష్టం చేశారు.

అన్నమయ్య సూచించినమందు "సిద్ధౌషధమట". ఘనదివ్యౌషధమట. పరమౌషధమట.

హరి అచ్యుతాయంటే నణంగుఁబాపములు
నరసింహ యని యంటే నాటిన దుఃఖములు మాను
పురుషోత్తమా యంటే బుండ్లు పూచుట మాను
పరమౌషధ మీతఁడే పాటింప మాకు.

ఈ కీర్తనలో హరి, అచ్యుతా, నరసింహా, పురుషోత్తమా, వాసుదేవ, కృష్ణా, శ్రీసతీశ, గోవిందా, మాధవ, నారాయణాది నామాలు జపించడం ప్రధానంగా చెప్పడం కవి ఉద్దేశ్యం. వీటికే మానసిక శారీరక రుజాలు మాన్పించే గుణాలు అన్వయింపబడ్డాయి. అన్నమయ్య, "శ్రీహరిపాదతీర్థమే చెడనిమందు" అనే కీర్తనలో "గురుతైన రోగములు గుణముచేసేమందు" అస్పష్టం చేశారు. పురందరదాసు ఆ రోగాలేమిటో వాటికి వాడదగిన మందులేమిటో ఈక్రింది కీర్తనలో విశదీకరించారు.

ఇదుకొళ్ళి భవరోగ కౌషధవను
ఇంద్రియవ జైసువుదె యిదకె ఇచ్ఛాపథ్య

వాసుదేవన నామ వాతవిధ్వంసిని
జనార్ధనన నామ జ్వరాంకుశ
మాధవన నామవే మనగండమండూర
మంగళాత్మన నామ మాల్యవసంత

చింతాయనక నామ త్రైలోక్యచింతామణి
భుజగ శయనన నామ భూపతి మాత్రె
రాజీవ లోచనన నామ రసకర్పూర
సీతాపతియనామ దివ్యసింధూర

నారాయణన నామ దివ్యతామ్రభస్మ
లోకదొడెయన నామ లోహభస్మ
వైకుంఠపతి యెంబ వంగభస్మవ కొళ్లి
శ్రీనివాసనన నామ స్వర్ణభస్మ

రామచంద్రనెంబ పూర్ణచంద్రోదయవు
కృష్ణ కృష్ణ నెంబ శ్లేష్మకుఠార
వారిజాంబక నెంబ వసంతకుసుమాకర
కమలనాభ నెంబ కర్ణచూర్ణవిడకో

ఇదను కొండవర పెసరను పేళువను కేళి
ముదది ప్రహ్లాద ముచికుంద ధ్రువను
సదమలె ద్రౌపదియు అజామిళను బదుకిదరు
పదుమాక్ష పురందర విఠల నెంబౌషధవు (కీ. 419)

అన్నమయ్యలాగే పురందరదాసు కేశవాదినామాలు చెప్పారు. వాత విధ్వంసిని మొదలయిన మందులపేర్లను సూచించారు. ఇంద్రియాలను జయించడమే పథ్యమనడంతో లౌకిక రోగాలు భవరోగాలు రాకుండ చేసుకోవడానికి వుపాయం కూడా చమత్కారంగా చెప్పారు. ఆ మందును తీసుకొన్న ప్రసిద్ధుల్నిచెప్పి మందు కొనండని కోరడంలో వ్యాపారపు కిటుకుల్ని బాగా తెలిసినవారుగా పురందరదాసు గోచరిస్తున్నారు.

## కృష్ణలీలలు—వాత్సల్యాభివర్ణనం :

ఆళ్వారులలో పెరియాళ్వారు పాశురాలలోను అన్నమయ్య పురందరదాసుల పదాలలోను కృష్ణునికి సంబంధించిన శిశుగీత లెక్కువ కనిపిస్తాయి. వీటిలో ప్రధానంగా వాత్సల్యం చోటుచేసుకొంటుంది. అలాంటి పదాలలో ఒకదాన్ని చూద్దాం.

కృష్ణుడు అందంగా వున్నాడు. రేపల్లెలోని వాళ్లందరు కృష్ణుని

ఎత్తుకొని వేళాపాళాలేకుండా తిప్పేస్తున్నారు. పెద్దాచిన్నాలేకుండా ఇష్టం వచ్చినట్లు ఆడిస్తున్నారు. బిడ్డకేమౌతుందోనని తల్లికి బెంగ, అంచేత వాళ్లనందరిని కోప్పడుతుంది. ఈ కీర్తన చూడండి.

సారెకు నంటకురే జడనందురు
ధీరుఁడాతఁడున్నతపు దేహియట

బాయటఁబెట్టకురే పక్షులు పారెడి ప్రొద్దు
వోయమ్మ బాలులకు నొప్పదందురు
మాయపుఁబులుగొగటిమచ్చిక నీబాలుని
చేయిచ్చి యెక్కించుకొనఁ జేరీనట

పంచలఁదిప్పకురే పాములు వెళ్లేటిపొద్దు
కొంచెపు బాలులఁబైకొనునందురు
మించిన పామొకటి మెరసి యీ బాలుని
దించక యెక్కించుకొనఁదిరిగీనట.

అలమి పట్టకురే అంటఁగాకుండెడివారు
తొలరమ్మ బాలులకు దోస మందురు
కలికి యీ తిరువెంకటపతిఁగదిసిన
చెలఁగి వేగమే చీర చిక్కినట. (12-247)

ఈ కీర్తనలో పక్షులు, పాములు, తాకకూడనివారి ప్రస్తావనవుంది. అంతరార్థం పరిశీలిస్తే గరుత్మంతుడు, ఆదిశేషుడు మొదలయిన దేవగణం స్వామి సంసేవార్థం వేచివున్నారనే భావం వ్యక్తమవుతుంది.

పురందరదాసు పదాలలో తల్లి యశోద కుమారుని జోలపాట పాడి నిద్రపుచ్చేసన్నివేశం వర్ణించబడింది. తల్లికుమారుడెంతకూ నిద్రపోకపోతే బూచి వచ్చాడని భయపెడుతుంది. మూడుకళ్లబూచి, ఒళ్లంతా కళ్లున్నబూచి, ఆరుముఖాల బూచి,చెట్టుమీద బూచీలు,రక రకాలుగా గోకులంలోని పిల్లల్ని పీడిస్తున్నాయట. ఈ కీర్తనలో బ్రహ్మ, శివుడు, దేవేంద్రుడు, సుబ్రహ్మణ్యస్వామి, గరుత్మంతుడు మొద లయిన దే వ ప రి వా ర ం స్వామిసేవార్ధం కాచుకు కూర్చున్నారనే వ్యంగ్యం స్పష్టమవుతుంది. బూచిబందిదె (కీ. 526) అనే ఈ కీర్తన కన్నడ దేశంలో బాగా ప్రసిద్ధి పొందిన శిశుగీతాలలో వొకటి.

అన్నమయ్య పురందరదాసులిద్దరు జానపద గేయ ఫణితుల్ని జానపదుల కథల్ని స్వీకరించి తమపాటలలోతగిన విధంగా పొందు పరచినవారే.

తల్లి యశోద చందమామ పాటపాడింది. కృష్ణుణ్ణి దగ్గరిక రమ్మని ఆప్యాయంతో చేతులు చాచింది. కృష్ణుడు తల్లిని ఏడిపించా లనుకున్నాడు. తల్లి పాడింది చందమామ కోసంకదా. "తనకోసం కాదుగదా". అంచేత శ్రీకృష్ణుడు చంద్రుణ్ణి చూచి కనుసైగ చేశాడు. చంద్రుడు చక్కా ఆకాశంనుండి భూమికి వచ్చాడు.యశోద దిగాలు పడింది. ఆకాశంకేసి చూసింది. చంద్రుడు పకపకానవ్వాడట.

చందమామఁ బాడి తల్లి సరిఁ బొత్తుకు రమ్మంటే
చందురుఁ జూచి కృష్ణుడు సన్నఁ జేసెను
ముందర చంద్రుఁడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యుంటినో యని మరచి వెరగందెను(10-285)

ఇదే మోస్తరు పురందరదాసు సంకీర్తనలోనూ ఒక జానపద ధర్మాని కనుగుణమయిన సన్నివేశం మలచబడింది.

తల్లి ముత్యాలహారం తెగిందని పెరట్లో బృందావనం దగ్గర కూర్చొని కూరుస్తుందట. కృష్ణుడు అక్కడే ఆడుతూ రెండు ముత్యాల్ని తీసుకెళ్లాడట. తల్లి గమనించలేదు. ముత్యాలు కూరుస్తుంటే తక్కువ వచ్చాయి. అక్కడంతా వెతికింది. పనివాళ్ళ నడిగింది. చివరకు కృష్ణుని అడిగింది. కృష్ణుడు తల్లిచేయెట్టి పిలుచుకుంటూ పెరటికేసి నడిచాడు. అక్కడ ఒక చెట్టు మొలిచివుందట. ఆ చెట్టునిండా ముత్యాలే. తల్లి దిగ్భ్రాంతిలో మునిగింది. ఈ వృత్తాంతాన్ని చెలికత్తె లిద్దరు మాట్లాడుకొనే పద్ధతిలో పురందరదాసులవారు కీర్తించారు.

"ఏను హేళలె నాను కృష్ణన మహిమ-యారిగూ తిళియదమ్మ
హొత్తారెద్దు యశోద ముత్తు పోణిసుతిద్దళు
హత్తిరిద్ద కృష్ణ బందు ఒందు ముత్తు తెగదు కొండు
సుత్తలిద్ద హుడుగర సహిత హిత్తలొళగె బిత్తిపోద"

అనే కీర్తన కన్నడదేశంలో బాగా ప్రసిద్ధి పొందిన కీర్తనల్లో ఒకటి.

ఆధ్యాత్మిక విద్యలో "మంత్రానికి" ప్రత్యేక బలం వుంది. గురుదీక్షపొంది మంత్రోపాసన చేసినవారు ఆయా మంత్రోద్దిష్ట దేవతల్ని సాక్షాత్కారం చేసుకొని ఇష్టకామ్యాలు పొందుతుంటారు. కాని మంత్ర సాధన చాల కష్టమయింది. శాస్త్రాదులలో పేర్కొనబడ్డ మోస్తరు గురువు లభ్యం కావడం కూడా ఇబ్బందితో కూడిందే. అందువల్ల

స్వామి నామాల్ని స్మరించడమే మంత్రం. ఆ కారణం వల్లనే అన్నమయ్య

ఉన్న మంత్రాధ్యలిందు సరా వొగి విచారించుకొంటే
విన్నకన్న వారికెల్ల విష్ణునామమంత్రము" అని

స్పష్టం చేశారు. ఏయే మంత్రాన్ని ఎవరెవరు పఠించి ధన్యులయ్యారో ఈ క్రింది కీర్తనలో చెప్పారు.

అన్ని మంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశు మంత్రము

నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహ మంత్రము
కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము
వేరె నాకుఁ గలిగె వేంకటేశు మంత్రము

రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుండు జపించె
నంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము

ఇన్ని మంత్రములెల్ల నిందిరానాథుఁడె గురి
పన్నిన దిదియ పరబ్రహ్మ మంత్రము
ననుఁ గావఁ గలిగెబో నాకు గురుడియ్యఁ గాను
వెన్నెల వంటిది శ్రీ వేంకటేశు మంత్రము

(11-1-140)

ఈ కీర్తనలో రామాయణ భారత భాగవతాలలోని విష్ణుభక్తులు స్మరింపబడ్డారు. "ఇన్ని మంత్రాలకు నిందిరానాథుడె గురి"అని వేంకటేశుమంత్రం చెప్పడంలో కలియుగంలో శ్రీ వేంకటేశ్వరుడే ప్రత్యక్షదైవమని చెప్పక చెప్పినట్లయింది.

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర మంత్రాన్ని చెబితే పురందరదాసు విఠల మంత్రాన్ని చెప్పారు. అతని దృష్టిలో శ్రీనరసింహ, రామ మంత్రాలన్నీ విఠల మంత్రానికి పర్యాయాలే. "ఇన్ని మంత్రముల కెల్ల నిందిరానాథుడెగురి"అని అన్నమయ్య అంటే పురందరదాసు "రామమంత్రవ జపిసో మనుజ,ఆ మంత్ర ఈ మంత్ర జపిసి కెడలు బేడ" (రామమంత్రాన్ని జపించు ఓ మనుజుడా. ఆ మంత్రం ఈ మంత్రమని నిలకడలేకుండా జపించి పాడయిపోవద్దు)అని వుద్బోధించారు. అలాగే "నరసింహ మంత్ర వొందిరలు సాకు-దురిత కోటియ తరిదు భాగ్యవను కొడువ"(నరసింహ మంత్ర మొకటి వుంటే చాలు. కోటాను కోట్ల పాపరాశుల నుండి తరించి భాగ్యాన్ని ప్రసాదించేదది) అని మరొక చోట అన్నారు. అన్నమయ్య "పన్నిన దిదియే పరబ్రహ్మ మంత్రము"అని అంటే పురందరదాసు ముట్టి భజిసిదవరిగె మోక్ష మంత్ర (తాకి అంటే నిష్ఠతో భజించేవారికి మోక్షమిచ్చే మంత్రం) అని స్పష్టం చేశారు.'నన్ను గావగలిగెంబో నాకు గురుండి య్యెంగాను' అని మంత్రం లభ్యం కావడానికి కారకుండయిన గురువును స్మరిస్తే పురందరదాసు జ్ఞాననిధులయిన ఆనందతీర్థులవారు సానురాగంతో ఎప్పుడూ సేవించే మంత్రమని) ఆ మంత్రమే తనకు గురూపదేశం వల్ల దక్కిందని అన్యాపదేశంగా చెప్పారు.

ఇంతవరకు అన్నమయ్య పురందరదాసుల పదాలను పూర్తిగా గుర్తించి వాటిలోని సామ్యాలను చర్చించడం జరిగింది. ఇంక అన్నమయ్య తన కీర్తనలో సకృత్తుగా ప్రయోగించిన పాదాన్ని గ్రహించి పురందరదాసు వ్రాసిన సంపూర్ణ కీర్తనలను చూద్దాం. తనకు గల భుజబల, ఆత్మబల, నామబల, వెనుబల, దైవ బలాదుల్ని చెబుతూ అన్నమయ్య

"కనుగొను నీ విగ్రహమే గ్రహబలమిదెనాకు" (6-109)

అని చెప్పారు. పురందరదాసు తనకు సర్వగ్రహ సంపత్తి ఏ రూపంలో దక్కిందో వివరిస్తూ వ్రాసిన కీర్తన-

బలవు బలవే నిన్ని బలవల్లదె–మిక్క
బలగళుంటె బణగు గ్రహగళింద

హరి నిన్న కృప యెనగె చంద్ర తారాబలవు
హరి నిన్న కరుణవే రవియ బలవు
హరి నిన్న మోహవే ఎనగె గురుభృగ బలవు
హరి నిన్న బలుమెయే శనియ బలవు

మంగళ మహిమ నిన్న అంగదరుశన సుఖద
మంగళన బలవు ఎన్నంగకె సదా
రంగ నిన్నయ చరణ కంగళలి నోడువుదు
హింగదె సుఖనీవ సౌమ్యబలవయ్య

ఆది మూరితి నిన్న నరివుదే రాహుబల
అదిమూలనె నిన్నగుణ కథనవ

ఆదరిసి కొండాడుతిపల దెనగె కేతుబల
ఆదిమహిమనె పురందర విఠల (కీ. 628)

"బలమంటే నీదే బలం. ఇతర బలాలు బలాలని చెప్పడానికి వీలే లేదు. గ్రహాదుల బలం, బలంకావు. నీకృప చంద్రతారాబలం. నీ కరుణ రవిబలం. నీమీది మోహం గురు భృగ బలం. నీబలిమి శని బలం. మంగళ పరంపరలు ప్రసాదించే నీ దివ్యాంగ వీక్షణ దర్శనమే మంగళ బలం. నీ చరణాల దర్శించడం సౌమ్యబలం. ఆదిమూర్తి నిన్ను తెలుసుకోవడమే రాహుబలం.నీగుణకథనం చేయడమే కేతుబలం.హరి బలమే తమకు సర్వరక్ష"అని అన్నమయ్య పురందర దాసులిద్దరు భావించినారనడం స్పష్టం.

పురందరదాసుల రచనగా ప్రసిద్ధి పడసిన

"కెరయ నీరను కెరెగె చల్లి
వరవ పడెదవరంతె కాణిరొ
హరియ కరుణదొళ ఆద భాగ్యవ
హరి సమర్పణె మాడి
బదుకిరొ నోడిబదుకిరొ"

అనే కీర్తనలోని భావం అన్నమయ్య రచనలో ఈ క్రింది విధంగా కనిపిస్తుంది.

నీవే నేరవు గాని నిన్నుఁ బండించేము నేము
దైవమా నీ కంటె నీ దాసులే నేర్పరులు

నీవు నిర్మించినవె నీకే సమర్పణ చేసి
సోవల నీ కృప యెల్లఁ జూర గొంటిమి
భావించాక మ్రొక్కు మ్రొక్కి భారము నీపై వేసిరి
పావనపు నీ దాసులే పంతపు చతురులు

చెరువుల నీళ్లు దెచ్చి చేరెడు నీపై జల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీవేంకటేశ యిటువంటి విద్యలనే
దరి చేరి మించిరి నీ దాసులేపో ఘనులు (8-49)

ఇంక అన్నమయ్య పురందరదాసుల పదాలలో కానవచ్చే సమానమయిన ఔపమ్యాలను కొన్నిటిని చూద్దాం.

అన్నమయ్య "గ్రుడ్డికుక్క సంతకు బోయి తిరిగిన దుడ్డుపెట్టే గాక దొరకేనా" (11-3-69) అని అంటే పురందరదాసు "కురుడు నాయి తా సంతెగె బంతంతె" (కీ. 407) (గుడ్డికుక్క సంతకు వచ్చిందట) అని పేర్కొన్నారు. ఈ శునకోపమానాన్ని ఇద్దరు వాగ్గేయ కారులున్ను విస్తరంగా వాడుకొన్నవారే.

అన్న. ఉదా: పాయ దీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి
చాయ కెంత గట్టినాను చక్కనుండేనా
కాయపు వికారమిది కలకాలము జెప్పినా
పోయిన పోనీలేగాక బుద్ధి వినీనా"
శునకము బతుకును సుఖమయ్యే తోచుగాని
తనకది హీనమని తలచబోదు (10-264)

పురం. "నాయి బందదప్ప (కుక్క వచ్చింపయ్యా) (కీ.280)

డొంకు బాలద నాయకర (వంకర తోకవున్న నాయకులు)

అదే మోస్తరు ఇద్దరి రచనలలోను "వేము" ఉపమానం చాల చోట్ల కనిపిస్తుంది.

"భారమైన వేంప మాను పాలు పోసి పెంచినాను
తీరని చేదే కాక తియ్య నుండీనా (6-8) అని

అన్నమయ్య అంటే "బేవు బెల్లదొళిడ లేను ఫల"(కీ. 27)(బెల్లంలో వేము పెట్టినంతమాత్రాన ఫలమేముంది?) అని అన్నారు-పురందర దాసు.

"నూతులుం దవ్వంగ బోతే భేతాళములు వుట్టె, కాతాళపు లోకులాల కంటిరే యీ సుద్దులు" (6-8) అని భేతాళోపమానాన్ని అన్నమయ్య చెప్పగా "తోడలు బావి భేతాళ హొరటితు" (కీ. 191) (త్రవ్వ బోతే భేతాళం బయలుదేరింది)అని అన్నారు పురందరదాసు.

అన్నమయ్య కీర్తనలలో తల్లి-బిడ్డకు సంబంధించిన ఔపమ్యం తగు మాత్రంలో వుంది.

"కోపగించి చంకబిడ్డగోరి తల్లడించితేను
పై పైనే పడుగాక పాసిపొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసారితే
నీ పాదాలే గతి గాక నే మానేనా (7-166)

తనువునఁ బొడమిన తతి నింద్రియములు
పానిగి యెక్కడికి బోవునయా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
ఎనగొని యెక్కడి కేగుదురయ్యా (5-260)

అడ వచ్చిన బిడ్డ నపరాధి జేసి తల్లి
వోడక యన్నము పెట్టకుండవచ్చునా? (6-214)

పురందరదాసు కీర్తనలలోని తల్లి బిడ్డకు సంబంధించిన కీర్తన పాదాలు–

అడువ శిశు తప్పు మాడలు జనని కొండాడువళల్లదె(కీ. 765)
(అడే బిడ్డ తప్పు చేస్తే తల్లి క్షమించి లాలించకుండా వుంటుందా)
హెత్త మక్కళు మరుళాదరె తాయ్తందె విత్తదె నెలనె బిసడువరె గోవింద (కీ. 393)

(కన్నబిడ్డలు మౌఢ్యులయితే తల్లిదండ్రులు స్వీకరించకుండా నేలపై విసరివేస్తారా?)

అన్నమయ్యకు భూతోపమానం ఏలా ప్రియమో పురందర దాసుకు అంతే.

ఓయమ్మ వెరపించె నొక భూతము
రోయక యిన్నిటనుం దిరుగు
అడరి శ్రీతిరువెంకటాద్రి నుండి
పొడచూపె నదివో పెంపుదు భూతము (5-112)

పుడమి నిందరిఁ బట్టె పెద్ద భూతము (11-3-43)

పురండరదాసు పదాలలోని భూతోపమానం ఈ విధంగా వుంది.

"ఇల్లి కుళితిద్ద భూతవు బందుల్లి నుంగితహది నాల్కులోకవ"

ఇంక అన్నమయ్య పురంధరదాసు పదాలలోని రచనా సాదృశ్యాలను పరిశీలిద్దాం.

తాళ్లపాక అన్నమయ్య శృంగార సంకీర్తనలు ఆధ్యాత్మక సంకీర్తనలు, 12 శతకాలు, శృంగార మంజరి, ద్విపద రామాయణము, వేంకటాచలమహాత్మ్యము సంకీర్తన లక్షణములను రచించారు. ఆయితే వీటిలో 12వేల సంకీర్తనలు, శృంగారమంజరి, శ్రీవేంకటేశ్వర శతకాలు మాత్రమే లభ్యం.

పురందరదాసు 4,75,000 పదాలు వ్రాసినట్టు, కన్నడపండితులు భావిస్తున్నారు. వాటిలో తీర్థక్షేత్రములు, స్థలపురాణాలగురించి 1,25,000 పదాలు, మధ్వవ్యాసరాయాది గురుపరంపరా మహిమల గురించి 5010 పదాలు, బ్రహ్మలోక కైలాసలోక దిక్పాలకలోక వర్ణనలకు సంబంధించి 90,000 పదాలు, దేవతామూర్తులు, ఇతర కల్యాణచరిత్రల గురించి 60,000, ఆహ్నికపద్ధతి, ఏకాదశి నిర్ణయ, జయంతీనిర్ణయ, శ్రుతిస్మృతుల గురించి 16,000 పదాలు, సుళాదులు 64,000, దేవరనామగళు 25,000 చేరతాయి. కాని వీటిలో సుమారు వేయి పదాలు మాత్రమే ప్రస్తుతం ముద్రింపబడ్డాయి.

భాషా భేదమనుసరించి చూస్తే అన్నమయ్య పురందరదాసులిద్దరు స్వభాషలో కీర్తనలు వ్రాయడమేగాకుండా సంస్కృతంలోను

సంకీర్తనలు వ్రాశారు. అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు పురందరదాసు కీర్తనలకంటె ఎక్కువ లభ్యమవుతున్నాయి. గాన విధానముననుసరించి చూస్తే వ్యక్తిగానాలు, సంవాదగానాలు, సమూహగానాలు ప్రక్రియా గానాలు ఇద్దరి రచనలలోను వున్నాయి. వస్తుభేదం బట్టి పరిశీలిస్తే శిష్టరచనలు, దేశిరచనలు రెండున్నూ వీరిరచనలలో కనిపిస్తాయి.అధ్యాత్మక సంకీర్తనలలో తాత్త్వికాలు లౌకికాలు రెండున్నూ వున్నాయి. భక్తి తత్త్వం తాత్త్వికాలలో ప్రధానమయితే రాజకీయ సాంఘిక సమకాలీన పరిస్థితులు లౌకిక పదాలలో విస్తరంగా ద్యోతకమవుతాయి.

రచనా ప్రయోగ సాదృశ్యాలలో సంస్కృత వాక్యాలను యథాతథంగా వుదాహరిస్తూ తాను చెప్పదలచుకొన్నదాన్ని సమర్థించడం ఒకటి. సామాన్య జనులకిట్టివి అక్కర్లేదు. కాని మధ్య తరగతి ప్రజానీకానికి ఈలాంటివి నమ్మకాన్ని కల్గిస్తాయి. అంచేతనే అన్నమయ్య పురందరదాసులు వేదపురాణేతిహాస ఉపనిషద్వాక్యాలను యథాతథంగా వాడారు. ఉదా॥

అన్న: నిండిన యీ జీవుల నీవే యన వెలితును
దండన బుద్ధులు "ద్వాసుపర్ణ" వున్నదిగాన (6-121)

వైకుంఠ పతి నిన్నువిడి గానవలెగాక
పైకొని "తద్విష్ణో పరమై" యుండగను (2-232)

అక్కడ వేదశ్రుతి "యత్యతిష్ఠద్దశాంగుల"
మెక్కువ యని పొగడనిదివో నీరూపము (11-1-61)

పుర: సందేహాత్మా వినశ్యతి యెంద శృతివృందగళెల్లవు
మిథిలేశ "మమకించిన్న దహ్యాతే" వింబంతె ఇరబేకు
(కీ. 404)

సంస్కృతంలోని భావాల్ని సులభమయిన భాషలో చెప్పడమనే సాజాత్యం ఇద్దరి రచనల్లోను వుంది.

"ఏకంసత్ విప్రా బహుధావదన్తి" అనే శ్రుతివాక్యసారాన్ని అన్నమయ్య "ఎంత మాత్రమున నెవ్వరు దలంచిన అంత మాత్రమే నీవు" (7-159) అనే కీర్తనలో విశదీకరించారు.

"ద్వాసుపర్ణా సయుజా సఖాయ
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరన్యః పిప్పలం స్వాద్ అతి
అనశ్నన్నన్యః అభిజాతశీతి"

ఈశ్లోక భావాన్ని పురందరదాసు ఈ క్రింది విధంగా వర్ణించారు.

ఎరడూ ఒందాగదు రంగ-ఎరడు ఒందాగదు
ఎందెందిగు రంగ
ఒందు వృక్షదల్లి ఎరడు పక్షిగళు
ఒందె గూడినల్లి ఇరుతిహవు
ఒందు పక్షి ఫలగళ నుంబుదు-మ
త్తొందు ఫలంగళ నుణ్ణదు రంగ
హలవు కొంబెగె ఒందు హారిదు ఒందు
హలవు కొంబెగె హార లరియదు
హలవనెల్ల ఒందు బల్లుదు ఒందు

హలవ నెల్లవ అరియదు రంగ
నూరెంటు కొంబెగె హారితు అదు
హారి మేలక్కెరి మీరితు
మీరి పురందర విఠల నిమ్మను
నేరి సుఖియాగి నింతితు రంగ (కీ. 251)

పైన చెప్పబడ్డవే గాకుండా ఎత్తుగడలలో కూడా సామ్యాలు కనిపిస్తాయి.

అన్న: ఊరకే దొరకునా వున్నతోన్నత సుఖము (6-104)

పురం: సుమ్మనే బరువుదే ముక్తి (కీ. 79)

అన్న: కంటి నఖిలాండ కర్త నధికునిగంటి (11-2-58)

పురం: కణ్ణారె కండెనచ్యుతన (కీ. 671)

ఇంక పాదాంత పదాల సాదృశ్యాలను పరిశీలిద్దాం. అన్నమయ్య పురందరదాసులిద్దరు జానపద గేయఫణితుల్ని తీసుకొని జనరంజక మయిన పదాలు వ్రాసినవారే. వీరి రచనలలో పాదాంత పదాల సామ్యం ఎక్కువ కనిపిస్తుంది.

చింత:

అన్న: బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మఁగన్న తండ్రియైన పరమాత్మ చింత (16-48)

పురం: అఖుకాలవు చింతె జీవకెక్క తన్న
మనవు మాధవనొళ్ మెచ్చువతనక

సతి యిద్దరు చింతె సతి యిల్లవ చింతె
మతి హీన సతియాదరు చింతెయు (కీ. 21)

ఫలః

అన్నః కలిగిన మతి వృథ గాకుండా
అలరుటె పుణ్యంబగు ఫలము
ఒనరిన యీ భవముసురనకుండ
ఘనుఁడీ జీవుఁడు గల ఫలము (5–262)

పుర: బేవు బెల్లదొళిడ లేనుఫల
హావిగె హాలెరదిరేను ఫల (కీ. 27)

సాక్షిః

అన్నః ఈతఁడు జలువుఁడౌట కివియే సాక్షి
యీతఁడు బ్రహ్మమౌట కీతఁడే సాక్షి (8–271)

పురంః హరి కృపె యలి తా నొలి దద్దాదరె
ఉరుతర మోక్షవె సాక్షి (6-24)

మనసాః


అన్నః పారకుమీ వో మనసా
పంతము విడవకు మీ మనసా ( 2–177)

పురంః బేడ మనవె బేడి కొంబెనో నాను
కొడదిరు కపటది మనవె (కీ. 633)

ఇవే గాకుండా జీవ, హంస, చిలుక, ధనము, శిశువు. లాలి అనే పదాలు చివర వచ్చేవి అన్నమయ్య పురందరదాసుల పదాలలో కోకొల్లలు.

స్థాలీపులాకన్యాయంగా ఇంతవరకు అన్నమయ్య పురందరదాస పదాలలోని సాదృశ్యాలు చర్చింపబడ్డాయి. కేవలం అన్నమయ్య పదాలతో మాత్రం గాక పెదతిరుమలాచార్యుల పదాలతోను పురందర దాస పదాలను తులనాత్మకంగా పరిశీలించవలసిన అవసరమున్నది.





**చదువు:** విద్వాన్ : రాష్ట్రభాషా ప్రవీణ్ (హిందీ) ఎం.ఏ. (తెలుగు) ఎం.ఏ. (సంస్కృతం) "దాక్షిణాత్యదేశిచ్ఛందో రీతులు-తులనాత్మక పరిశీలన" అనే సిద్ధాంతవ్యాసానికి పి. హెచ్. డి; "అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు ఒక పరిశీలన" అనే అంశంపై మరొకసిద్ధాంతవ్యాస సమర్పణకు ప్రయత్నం

**వృత్తి:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఆంధ్రోపన్యాసకత్వం

**రచనలు:**

<u>వెలుగుచూచినవి:</u>

సంగ్రహ వ్యాకరణము, వ్యాసమందారము త్యాగరాజు,
అన్నమయ్య ఓర్ అరిముగం (తమిళం)
కాందబిని మరి వివిధ పత్రికల్లో దాదాపు నలబై వ్యాసాలు

అచ్చులో:

అన్నమయ్య - త్యాగయ్య.
అన్నమయ్య హనుమత్సంకీర్తనలు
అన్నమయ్య సూక్తులు, నావ్యాసాలు, దాససాహిత్య పరిచయం

**తెలిసినభాషలు:** తెలుగు, తమిళం, కన్నడం, మరాఠి, హిందీ, ఆంగ్లం, సంస్కృతం

**అభిరుచులు:** కవితలల్లడం, అనువాదరచనలు అందించడం.